

నాణ్యమైన ఉల్లికి ధర తగ్గిస్తే చర్యలు : కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు తెచ్చిన నాణ్యమైన ఉల్లికి కూడా తక్కువ ధరను అందిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రంజిత్ బాషా వ్యాపారులను హెచ్చరించారు. కర్నూలు మార్కెట్ యార్డును కలెక్టర్ రంజిత్ బాషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పూర్తిగా పక్వానికి వచ్చిన ఉల్లిని మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. ముందస్తు వర్షాలకు చేతికందిన ఉల్లిని మాత్రమే అమ్మకానికి రైతులు తీసుకువస్తే మంచి ధర లభిస్తుందని, ప్రభుత్వం ముందస్తుగా మద్దతు ధర ఇస్తుందనే ఆశతో పక్వానికి రాని ఉల్లిని కూడా అమ్మకానికి తీసుకురావద్దని సూచించారు. ఉల్లి రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి రామాంజ నేయులును ఆదేశించారు. కర్నూలు మార్కెట్ యార్డులో కొనుగోలు చేసిన ఉల్లిని ఎప్పటికప్పుడు రాష్ట్రంలోని రైతుబజార్లకు ఇతర విభాగాలకు తరలించాలని మార్క్‌ఫెడ్ అధికారి రాజుకు సూచించారు. అనంతరం వ్యాపారులు, వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు క్వింటానికి రూ.1200 గిట్టుబాటు ధర అందిస్తుందన్న ఉద్దేశంతో రైతులతో తక్కువ ధరకు ఉల్లిని కొనుగోలు చేయడం సరికాదని, తనిఖీలు చేయించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు కొనుగోళ్లను దగ్గరుండి పరిశీలించాలన్నారు. లైసెన్సు కలిగిన వ్యాపారులందరూ తప్పనిసరిగా ఉల్లి కొనుగోళ్లలో పాల్గొనేలా చూడాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఉద్యానశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజ నేయులు, ఏడీఎం నారాయణమూర్తి, కమిటీ చైర్‌పర్సన్ అజ్మద్‌బీ, వైస్ చైర్మన్ శేషగిరి శెట్టి తదితరులు ఉన్నారు.

జనరల్ మెడిసిన్ పీజీ సీట్లు పెంపు

- తొమ్మిది సీట్లను పెంచిన ఎన్ఎంసీ
- కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్‌లో పీజీ సీట్లు పెరిగాయని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మెడిసిన్ విభాగంలో ప్రస్తుతం 20 పీజీ సీట్లు ఉండగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) అదనంగా మరో 9 పీజీ సీట్లను పెంచిందన్నారు. మెడిసిన్‌లో పెరిగిన పీజీ సీట్లు ఈ విద్యా సంవత్సరం నుంచి అమలులోకి వస్తాయని అన్నారు. ఈ సీట్లు పెంపు కోసం కర్నూలు జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డా.శ్రీరాములును ప్రత్యేకంగా ఢిల్లీకి పంపి ప్రక్రియను విజయవంతంగా నిర్వహించి పీజీ సీట్లు పెంపు దలకు కృషి చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ, స్టేట్ క్యాన్సర్ యూనిట్ విభాగాల్లో కూడా అదనపు పీజీ సీట్లు కోసం ప్రతిపాదనలు పంపామని, అవి కూడా వచ్చే అవకాశం ఉంద న్నారు. జనరల్ మెడిసిన్‌లో పెరిగిన సీట్లతో రోగులకు మెరుగైన సేవలు అందుతాయన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.

పొంగిన వాగులు



కర్నూలు నగరం నడిబొడ్డున హంద్రీనది పరవళ్లు

కర్నూలు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కందనవోలు పల్లెసీమలు తడిసి ముద్దయ్యాయి. వాగులు వంకలు పొంగి పొర్లాయి. పలు ప్రాంతాల్లో పంట పొలాలు చెరువులను తల పిస్తున్నాయి. కర్నూలు నడిబొడ్డున ప్రవహిస్తున్న హంద్రీ నది, ఒక్కెరవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో ఏకైక అతి పెద్ద జలాశయం గాజులదిన్నె ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. ఏ క్షణమైనా గేట్లు ఎత్తేందుకు ఇంజనీర్లు సన్నద్ధం అవుతున్నారు. దిగువన గోనె గండ్ల, కోడుమూరు, కల్లూరు మండలాల్లో రెడ్ అలర్ట్ (ప్రమాద హెచ్చరిక) జారీచేశారు. కర్నూలు నగరంలో విఠల్‌నగర్, బుధ వారపేట, జమ్మిచెట్టు ఏరియా కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. హంద్రీనీవా కాలు వలోకి ఇన్‌లెట్ ద్వారా వర్షపు నీరు చేరుతుండడం, గట్టు అంచుల్లో ప్రవాహం కొనసా గడంతో రైతులు ఆందోళన చెం దారు. మద్దికెర మండలం ఎడ వల్లి సమీపంలో 138 కిలో మీటర్ల వద్ద హంద్రీనీవా కాలువ గట్టుపై ప్రవహించడంతో రైతులు భయందోళన వ్యక్తం చేశారు. అప్రమత్తమైన ఇంజనీర్లు నీటి విడుదల తగ్గించారు. మంత్రా లయం సమీపంలో నల్లవాగులో ఆర్టీసీ బస్సు వరదలో చిక్కుకు పోయింది. భారీ వర్షాలకు పత్తి రైతులకు అపార నష్టం సంభ వించింది. జిల్లాలో 762.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా, సగటు వర్షపాతం 29.3 మిల్లీ మీటర్లు నమోదైందని అధి కారులు పేర్కొన్నారు.

ఏడు వేల క్యూసెక్కులు

గాజులదిన్నె ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 377 మీటర్లు, నిల్వ సామర్థ్యం 4.50 టీఎంసీలు. పత్తికొండ, దేవన కొండ, మద్దికెర మండలాల్లో బుధ వారం తెల్లవారు జాము నుంచి కురుస్తున్న వర్షాల కు హంద్రీనదిలో భారీగా వరద ప్రవహిస్తుంది. సాయంత్రం 5 గంటల సమయంలో ప్రాజెక్టులోకి ఏడు వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఏ క్షణంలో నైనా గేట్లెత్తే అవకాశం ఉందని హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ, టీబీపీ ఎల్లెల్సీ ఈఈ పాండురంగయ్య తెలిపారు.



కల్లూరులో మొక్కజొన్న పంటలోకి వర్షపు నీరు

వర్షం వార్తలు 6లో

పత్తి రైతులు తీవ్రంగా..

జిల్లాలో కురిసిన వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ వర్షాలకు పూత, కాయ రాలిపోవడమే కాకుండా పలు గ్రామాల్లో ఎండలకు పగిలిన పత్తి కూడా వర్షపు నీటికి నేలపాలవడంతో అన్నదాతలు కన్నీరు పెడుతున్నారు. అదే క్రమంలో టమోటా, ఉల్లి రైతులు కూడా ఊహించని నష్టం చవిచూడాల్సి వస్తుంది. టమోటా కాయలుపై మచ్చ ఏర్పడి ధరలు పతనం అవుతున్నాయి. మంత్రాలయం నుంచి నాగులదిన్నె రహదారిలో నల్లవంక ఉప్పొంగింది.

- జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- ప్రమాదపు అంచుల్లో హంద్రీ-నీవా కాలువ
- గరిష్ట స్థాయికి గాజులదిన్నె జలాశయం
- ఏక్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం
- దిగువ గ్రామాల్లో రెడ్ అలర్ట్
- పత్తి రైతులకు అపార నష్టం



ముడుమలగుర్తిలో పత్తి పొలంలో నిలిచిన నీరు

మునిగిన పత్తిపంట

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ముడుమలగుర్తి గ్రామంలో పత్తి పంట నీట మునిగింది. ఉరుములు, మెరుప లతో కూడిన వర్షం పడడంతో ప్రజలు ఇళ్లకే పరిమిత మయ్యారు. లోతట్టు పొలాలు, వీధులు జలమయం అయ్యాయి. పొలాల్లో పీకి ఉంచిన ఉల్లి పంట తడిసిపోయింది. కోత జరిపించిన ఉల్లిని టార్పాలిన్ పట్టాలు కప్పి కాపాడుకున్నారు.



కర్నూలు నగరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కెర వాగు

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదే శించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవా ల్సిన చర్యలపై గురువారం సబ్ కలెక్టర్ ఆర్డీవోలు తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ టెలి కాన్ఫ రెన్స్ నిర్వహించారు.

కలెక్టర్‌గా అట్టాడ సిరి

- కలెక్టర్ రంజిత్‌బాషా బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ అట్టాడ సిరి నియమితులయ్యారు. సెకండరీ హెల్త్ విభాగం డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెకు కలెక్టర్‌గా కూటమి ప్రభుత్వం ఇచ్చింది. శుక్రవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.రంజిత్‌బాషాను బదిలీ చేసింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సిరి విద్యాభ్యాసం మొత్తం విశాఖపట్నంలోనే సాగింది. విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్‌లో ఉండగా ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ సమయంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గ్రూప్-1 రాసి తొలి ప్రయత్నంలోనే విజేతగా నిలిచారు. మొదట శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా, తూర్పు గోదావరి, ప్రకాశం జిల్లాల్లో జేసీ-2గా పని చేశారు. 2015లో ఐఏఎస్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. 2020 మే 20 నుంచి 2022 ఏప్రిల్ 6 వరకు అనంపురం జిల్లా విలేజ్, వార్డు సచివాలయం జేసీగా పనిచేశారు. 2023 ఏప్రిల్ 6 వరకు స్త్రీశిశు సంక్షేమం, అభివృద్ధి శాఖ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తరువాత 2023 మే 24న సర్వే ఆఫ్ విలేజెస్ అబాడి అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి 2024 ఆగస్టు 22వరకు ఆ హోదాలో కొనసాగారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 ఆగస్టు 22నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 15వరకు ఏపీఎస్ఏసీఎస్ ఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం సెకండరీ హెల్త్ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



కలెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న రంజిత్‌బాషా



కలెక్టరుగా పి.రంజిత్‌బాషా 2024 జూన్ 22న రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 15 నెలలు జిల్లా కలెక్టరుగా పనిచేసిన ఆయన మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కల్లూరు మండలం పర్ల గ్రామంలో 'పల్లెకు పోదాం'లో భాగంగా పర్యటించిన రంజిత్‌బాషా అక్కడికక్కడే పలు సమస్యలు పరిష్కరించారు. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక నోడ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. వేదావతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు, హంద్రీనీవా ప్రాజెక్టు పందికోన రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు తక్షణం పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా స్పందించేలా చేయడంతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా పాత్ర ఎంతో ఉంది.

రోగులకు సత్వర వైద్యమందించండి

- వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పక చేయించండి
- ఆసుపత్రిలో మందులను అందుబాటులో ఉంచాలి
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల బారిన పడే రోగులకు సత్వరమే వైద్యమందించాలని కర్నూలు విజృంభిస్తున్నాయని, ఈ వ్యాధులకు సత్వర వైద్యం అందించాలనిజీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు వైద్యులను ఆదేశించారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సీజనల్ వ్యాధులపై ఆయన సూపరింటెండెంట్ చాంబరులో అడ్వైజరీ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయనీ, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ముఖ్యంగా మెడిసిన్, ఎమర్జెన్సీ, చిన్నపిల్లల విభాగాలు అత్యవసర సేవలను వేగవంతంగా అందించాలన్నారు. మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ, రేడియాలజి ల్యాబ్ పరీక్షలు చేసి వాటి ఫలితాలు త్వరగా ఇవ్వాలని ఆదేశించారు. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉండేలా చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు, ఇతర జబ్బులపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రతివారం అన్ని విభాగాలు సమన్వయం చేసుకుని వ్యాధులపై నివేదిక ఇవ్వాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. సమీక్షలో సీఎస్ఆర్ఎంవో డా.టీసీ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ డా.రేణుకాదేవి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ లక్ష్మిబాయి, బయోకెమిస్ట్ హెచ్‌వోడీ డా.కిరణ్మయి, ఎస్‌పీఎం విభాగపు హెచ్‌వోడీ. డా.సుధా కుమారి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్.పి.సావిత్రీబాయి పాల్గొన్నారు.

కన్నకొడుకును చంపేశాడు..!

పసిబిడ్డను నీటి డ్రమ్ములో ముంచి హత్య.. ఆపై భార్యపై దాడి

వివరాలు 7లో

తెరపైకి ఓఆర్ఆర్



- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు
- ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ ఆదేశం
- ఆర్అండ్‌బీ, కార్పొరేషన్ అధికారుల సర్వే

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని లాజిస్టిక్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో పలు జాతీయ రహ దారుల నిర్మాణం, విస్తరణ పనులు జరుగు తున్నాయి. రాష్ట్ర రహదారులకు సంబంధిం చిన పనులను కూడా ప్రభుత్వం వేగవంతం చేసింది. తాజాగా కర్నూలు ఔటర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. కర్నూలు ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి గతంలో ప్రతిపా దనలు చేయగా అడుగులు ముందుకు పడలేదు. తాజాగా కలెక్టర్ సూచనలతో కర్నూలు ఓఆర్ఆర్ మరోసారి తెరపైకి వచ్చింది.

రద్దీని తగ్గించడానికి..

రాష్ట్రంలో మరో కొత్త ఓఆర్ఆర్ మీద చర్చ జరుగుతోంది. కర్నూలు నగరం చుట్టూ ఓఆర్ఆర్ నిర్మాణ ప్రణాళికలు మరోసారి తెరపైకి వచ్చాయి. కర్నూలు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ఈప్రాజెక్టు చేపట్టాలని భావించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆదిశగా ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో తాజాగా కర్నూలు జిల్లా యంత్రాంగం ఓఆర్ఆర్ ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నాలను ప్రారంభించింది. ఇటీవల కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో కర్నూలు ఓఆర్ఆర్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన తర్వాత ఓఆర్ఆర్‌కు సంబం ధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ రంజిత్‌బాషా నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు.

బళ్లారి చౌరస్తాలో నిత్యం..

పెద్దపాడును హైదరాబాద్ జాతీయ రహదారికి అనుసంధానించేలా ఓఆర్ఆర్ ప్రతిపాదన చేస్తున్నారు. కర్నూలు నగరానికి సంబంధించి ట్రాఫిక్ రద్దీ అనేది ఓ సమస్యగా మారిపోయింది. బళ్లారి చౌరస్తా వద్ద నిత్యం రద్దీగా ఉంటోంది. పెద్దపాడు నుంచి వచ్చే వాహనాలు, బెంగళూరు లేదా హైదరాబాద్ వైపు వెళ్లేందుకు జాతీయ రహదారి లోకి ప్రవేశించే వాహనాలు బళ్లారి చౌరస్తా గుండా వెళ్లవలసి ఉంటుంది. ఇక్కడే భారీగా ట్రాఫిక్ జామ్ అవుతూ వస్తోంది. ఈనేపథ్యంలో ఈసమస్య పరిస్కారానికి మంత్రి టీజీ భరత్ గతంలో ఓ ప్రతిపాదన చేశారు. హైదరాబాదు రోడ్డు నుంచి కొత్త బస్టాండ్ వరకు చిన్న బైపాస్ ద్వారా లూప్ రోడ్డువేయాలని ప్రణాళికలు రచించారు. దీంతో సమస్య పరిష్కారం కాదని భావిస్తున్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి కర్నూలు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణమే పరిష్కారమనే సూచనలు, అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ రింగ్ రోడ్డు నిర్మాణానికి..

గతంలో ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను సుంకేసుల రోడ్డులోని సెయింట్‌జోసెఫ్ కళాశాల నుంచి సంకల్ బాగ్, సాయిబాబా గుడి, రాఘవేంద్రస్వామి మఠం, మీదుగా రోజా దర్గా వరకు నిర్ణయించారు. రాంబోట్ల ఆలయ మీదుగా ఓల్డ్ సిటీ, జోహరాపురం, తుంగభద్ర నది వెంబడి ప్లాన్‌చేశారు. ఆదిశగా అడుగులు ముందుకు పడలేదు. కొత్త ఓఆర్ఆర్ రూట్ ఇంకా ఖరారు కాలేదు. ఈనేపపథ్యంలో నగరవాసులు కర్నూలు ఓఆర్ఆర్ గురించి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈరింగ్ నిర్మాణానికి సంబంధించి తాజాగా రోడ్లు భవనాలు, నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సర్వేలను చేపట్టారు.

ఎడతెరిపిలేని వాన

- ఉల్లి రైతుల్లో వణుకు
- 15 మండలాల్లో భారీ వర్షం
- గూడూరులో అత్యధికంగా 99 మి.మీ. వర్షపాతం


పెంచికలపాడు దగ్గర వక్కెలేరు వాగు పొంగిపొర్లడంతో బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ఉల్లి రైతుల్లో మళ్లీ వణుకు మొదలైంది. ఒక వారం రోజులు వర్షం తెరిపించి ఎండలు రావడంతో రైతులు ఆనందపడ్డారు. ఉల్లిని ఆరబెట్టుకుని మార్కెట్‌యార్డుకు తీసుకెళ్లి మంచి ధర అందుకుందామని ఆశించిన రైతులకు గురువారం కురిసిన వర్షం వారిలో మళ్లీ ఆవేదనను నింపింది. జిల్లాలో గురు వారం 23 మండలాల్లో వర్షాలు పడ్డాయి. గూడూ రులో 99 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదు కాగా మద్దికెరలో 97.8, చిప్పగిరిలో 68.4, హాల హర్విలో 62.2, మంత్రాలయంలో 51.6, తుగ్గలిలో 45.4, ఆలూరులో 38.2, పత్తికొండలో 35.2, కల్లూ రులో 30.8, ఆదోనిలో 28.2, నందవరంలో 27.4, సి.బెళగల్‌లో 25, వెల్దుర్తిలో 22.6, ఆస్పరిలో 22.4, ఓర్వకల్లులో 22, కర్నూలు అర్బన్‌లో 19.6, కర్నూలు రూరల్‌లో 18.2, హోళగుందలో 16.4, మిగిలిన మండలాల్లో 2.6 నుంచి 9.6 మి.మీ., వరకు వర్షం కురిసింది. ఈ వర్షాల వల్ల జిల్లాలో చేతికందే సమ యంలో ఉన్న ఉల్లి పంట మొత్తం నీటి పాలైంది. ఉల్లిగడ్డలను కోసి కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలని వివిధ గ్రామాల రైతులు సిద్ధం అవుతున్న తరుణంలో ఇలా వర్షం పడటంతో రైతు లు ఆందోళనకు గురవుతున్నారు. ఉల్లిని కాపాడుకు నేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు.

పరవళ్లు తొక్కిన కుందూ


ఓర్వకల్లులో పొంగి పొర్లుతున్న కుందూ వాగు

ఓర్వకల్లు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టడంతో వాగులు, వంకలు చెక్‌డ్యాంలు వర్షం నీటితో కళకళలాడాయి. ఓర్వకల్లులోని కుందూ వాగు పొంగి పొర్లింది. గ్రామం నుంచి జీవేశ్వరస్వామి గుడి సమీపాన ఉన్న కాలనీకి వాగు ఉధృత ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉప్పలపాడు, లొద్దిపల్లె గ్రామాల్లో వర్షం నీరుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- గూడూరులో ఉధృతంగా వక్కెలేరు వాగు
- వక్కెర వాగులో చిక్కుకొన్న ఆర్టీసీ బస్సు


పెంచికలపాడు దగ్గర బ్రిడ్జిపైకి చేరిన వరద ప్రవాహంతో ప్రైవేట్ వాహనంలో వెళ్తున్న విద్యార్థులు

గూడూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గూడూరులో గురువారం తెల్లవారుజామున నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వంకలు వాగులు పొంగిపొర్లాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వక్కెర వాగు పొంగి పొర్లడంతో పెంచికలపాడు దగ్గర బ్రిడ్జిపై వరద పోటెత్తింది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిమ్మగురుడు స్వామి ఆలయం సమీపంలో వంక పొంగి పొర్లడంతో సింగనగేరిలోని ఇళ్ళు, గుడిసెల్లో నీరు చేరడంతో జనం ఇబ్బందులు పడ్డారు. అలాగే ఎస్సీ కాలనీ, తూర్పు, పడమర బీసీ కాలనీల్లో లోతట్టు ప్రాంతాలు జలమ యం కాగా ఇళ్లలోకి నీరు చేరకుండా ఇసుక బస్తాలను అడ్డంగా ఉంచారు. కాలనీల్లో మొకాటి లోతు వర్షం నీరు చేరడంతో కాలువల్లో చేరిన చెత్తను ప్రొక్లెయినర్లతో తొలగించారు. గూడూరు నుంచి కర్నూలుకు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెంచికలపాడు వద్ద వక్కెర వాగులో వరద ప్రవాహనికి చిక్కుకొంది. దీంతో ఎమ్మిగనూరు నుంచి గూడూరు మీదుగా కర్నూలుకు వెళ్లె ఆర్టీసీ బస్సులు పెంచికలపాడు బ్రిడ్జి దగ్గర నిలిచిపోయాయి. మరికొన్ని వాహనాలు ప్యాలకుర్తి మీదుగా కర్నూలుకు వెళ్లాయి.


గూడూరులో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతంలో ఇళ్లల్లో చేరిన వర్షపు నీరు


గూడూరులో కాలనీల్లో ప్రవహిస్తున్న వర్షం నీరు


వక్కెలేరు వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

దెబ్బతిన్న టమోట

- కలచట్లలో కూలిన ఇల్లు


ప్యాపిలి: కలచట్లలో వర్షానికి కూలిన ఇల్లు

ప్యాపిలి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో టమోటా పంటలు దెబ్బతిన్నాయి. ప్యాపిలితో పాటు కలచట్ల, ఎర్రగుంట్లపల్లి, వెంగళాంపల్లి, ఏనుగమర్రి, ఎస్.రంగాపురం, నల్లబల్లి గ్రామాల్లో రైతులు వేరుశనగ, సజ్జ, కంది పాటు టమోట పంటను అధికంగా రైతులు సాగు చేశారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేశారు. అయితే భారీ వర్షానికి పొలాలల్లో వర్షపు నీరు నిలిచింది. ప్రస్తుతం కోత దశలో ఉన్న టమోట పంట వర్షానికి దెబ్బతిన్నది. కాయలు రెండు రోజుల్లో కుళ్లిపోతాయని రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

కలచట్లలో కూలిన ఇళ్లు : ప్యాపిలి మండలంలోని కలచట్ల గ్రామంలో చంద్రశేఖర్‌కు చెందిన మట్టిమిద్దె పైకప్పు వర్షానికి కూలిపోయింది. అయితే ప్రమాదాన్ని ముందుగానే గ్రహించిన కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది.

ఆత్మకూరులో భారీ వర్షం

లోతట్టు కాలనీలు జలమయం

ఆత్మకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆత్మకూరు ప్రాంతంలో బుధవారం వర్షం దంచికొట్టింది. తెల్లవారుజాము 3గంటల నుంచి ఉదయం 10గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో పట్టణంలోని పలు లోతట్టు కాలనీల్లోకి వరద వచ్చి చేరింది. ఆత్మకూరు పట్టణంలోని ఏకలవ్యనగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, లక్ష్మీనగర్, గరీబ్‌నగర్, హుసేన్‌సానగర్, రహమత్‌నగర్ తదితర ఏరియాల్లోని లోతట్టు కాలనీల్లో నీరు చేరడంతో జనం అసౌకర్యానికి గురయ్యారు. కప్పలకుంట, అప్పారావువీధి, పోస్టాఫీసు ఏరియా, కేజీరోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిలిచింది. ఆత్మకూరు ఆర్టీసీ డిపో, మార్కెట్‌యార్డు ప్రాంగణాల్లోకి భారీగా వర్షపునీరు చేరింది. ఆత్మకూరు పట్టణం మీదుగా ప్రవహించే గుండ్లకమ్మ వాగుతో సహా శివారులో భవనాశి, పడేవాగులు ఉధృతంగా ప్రవహించాయి. అలాగే పలు గ్రామాల్లోని పంటపొలాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని అన్ని చెరువుల్లో నీటినిల్వలు గరిష్టస్థాయికి చేరుకున్నాయి. కాగా నంద్యాల రహదారి సమీపంలో జరుగుతున్న కేజీరోడ్డు బైపాస్ నిర్మాణం వల్ల పంటపొలాల్లో భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పట్టణంలోని పలు లోతట్టు కాలనీలను సందర్శించి వర్షపునీటిని మళ్లించే చర్యలు చేపట్టారు.


ఆత్మకూరు మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు

కల్వటాలలో ఎర్రవాగు కన్నెర్ర

- పలు గ్రామాల్లో ఉప్పొంగి ప్రవహించిన వంకలు
- కొలిమిగుండ్లలో వీధులు జలమయం
- నెల్లూరు-ముంబై హైవేపై రాకపోకలకు అంతరాయం


కోరుమానుపల్లె వద్ద రాకపోకలను అడ్డగించిన వంక

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండలంలో వివిధ గ్రామాల్లో వానలు దంచి కొట్టాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం, గురువారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా 129మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

కల్వటాల వద్ద ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించింది. కొండ ప్రాంతాల్లో నుండి వాగుకు పెద్ద ఎత్తున వరద నీరు పోటెత్తడంతో నెల్లూరు-ముంబై హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అటు జమ్మలమడుగు వైపు, ఇటు తాడిపత్రి వైపు సమారు ఆరు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఐ మద్దినేని రమేష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసులు కల్వటాల వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మండలంలోని ఇటిక్యాల, అబ్దులాపురం, కోరుమానుపల్లె, మీర్జాపురం, కల్వటాల, తిమ్మనాయినిపేట తదితర గ్రామాల్లో ప్రధాన వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. సద్దలవెంగన్న చెరువు, తిమ్మనాయినిపేట చెరువు, దయ్యాలచెరువు, చిన్న చెరువు, హనుమంతుగుండం చెరువులు నిండు కుండల్లా మారడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. మరోవైపు కోరుమానుపల్లె, కొలిమిగుండ్ల, మీర్జాపురం, బెలుం తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంట పొలాల్లో పెద్ద ఎత్తున వరద నీరు చేరి, పంటలు నీటమునిగాయి. ఇంకోవైపు మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని శాంతినగర్‌లో పలు వీధులు భారీ వర్షం కారణంగా జలమయమయ్యాయి. 4వీధుల్లో సుమారు 3అడుగుల మేర వరద నీరు చేరడంతో ఇళ్ల ముందు పార్క్ చేసివున్న బైకులు మునిగి పాడైనట్లు స్థానికులు వాపోయారు. వర్షం ఆగిన అనంతరం సుమారు నాలుగు గంటల పాటు శాంతినగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


పాణ్యంలో స్తంభించిన రాకపోకలు

పాణ్యం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండలంలో ఉన్నఫళంగా కురిసిన వర్షానికి పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఉదయం విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోయారు. బలపనూరు పరిధిలోని వడ్డుగండ్ల, రసూల్‌పేట మధ్య గల కావేటి వాగుకు పెద్ద ఎత్తున నీరు చేరడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొందరు ఖాళీ పాల క్యాన్లను ఆసరాగా చేసుకుని వాగును దాటారు. కానుగలవాగు, వద్దెల వాగు, జుర్రాగు వాగులకు పెద్ద ఎత్తున నీరు చేరి ప్రవహించాయి.


వడ్డుగండ్ల, రసూల్ పేట మధ్య పొంగి ప్రవహిస్తున్న కావేటి వాగు

ఔరా అవుకు..!

- కనువిందు చేస్తున్న జలపాతం


అవుకు రిజర్వాయర్ వద్ద కనువిందు చేస్తున్న ఎత్తిపోతల జలపాతం

అవుకు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవుకు మండలంలోని ఓ జలపాతం ప్రపంచ ఖ్యాతి గడించిన జోగ్ ఫాల్స్‌ను తలపిస్తోంది. మండలంలోని ఎర్రమల కొండల నుంచి వర్షపు నీరు సెలయేర్ల ద్వారా ప్రవహిస్తూ అవుకు రిజర్వాయర్ వద్ద కనువిందు చేస్తోంది. గురువారం అవుకు మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో ఎత్తయిన కొండలపై నుంచి జాలువారుతున్న అవుకులోని జలపాతాన్ని వీక్షించేందుకు యువత ఉత్సాహం చూపించారు. ఇదిలా ఉండగా అవుకు రిజర్వాయర్‌లో 3 టీఎంసీల నీరు ఉండగా ఎత్తిపోతల ద్వారా రిజర్వాయర్‌కు భారీగా నీరు వచ్చి చేరుతోంది. కునుకుంట్ల - ఉప్పలపాడు మధ్య వాగు పొంగిపొర్లటంతో బస్సుల రాకపోకలు నిలచిపోయాయి.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దసరా కానుక గా ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కర్నూలులో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఉద్యోగులుగా తాము ఎల్లవేళలా సహకరిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ సురేష్ రెడ్డి, సిటీ సెక్రెటరీ చెన్నకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ కోర్సులకు గడువు పొడిగింపు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సర్వీసెస్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూరించిన దరఖాస్తులు (ఆఫీసు దినాల్లో) కేఎంసీ, కర్నూలులో రూ.100 రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని వెల్లడించారు. కౌన్సెలింగ్ అక్టోబరు 10వ తేదీ కేఎంసీలో నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారని, ఆ తర్వాత మిగిలిన గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వబడునని వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పాణ్యం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ సబ్ జూనియర్స్ విభాగంలో జరిగే పోటీలలో పాణ్యం మోడల్ పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ దినేశ్‌బాబు తెలిపారు. గురు వారం ఆయన మాట్లాడుతూ ఈనెల 13, 14 తేదీలలో విశాఖ పట్నంలో జరిగే ఏపీ స్టేట్ టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది బాలికలు, ఎని మిది మంది బాలురు పాల్గొం టున్నారన్నారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందిం చారు. కార్యక్రమంలో పీడీ కిర ణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

41కిలోల భారీ చేప చిక్కింది

ఆదోని డివిజన్ పరిధిలోని తుంగభద్రకు చెందిన జాలరు రుద్ర వలలో 41 కేజీల భారీ బొచ్చ (కట్ల) చేప చిక్కింది. రోజు మాదిరిగానే తుంగభద్ర నదిలోకి చేపలు పట్టడానికి వెళ్లగా వలలో గురువారం భారీ చేప చిక్కిందని రుద్ర తెలిపారు. ఇంతవరకు ఎప్పుడూ ఇంత పెద్ద చేప చిక్కలేదని, మొదటిసారిగా ఇంత పెద్ద చేపను పట్టుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశాడు. ఈ చేపను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. ఈ కట్ల చేపను రూ.8 వేలకు విక్రయించినట్లు తెలిపారు.



వలకు చిక్కిన 41 కేజీల బొచ్చ (కట్ల) చేపను చూపిస్తున్న జాలరి రుద్ర

● ఆదోని, ఆంధ్రజ్యోతి

ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం

డోన్ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట్ల గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డులో ఉన్న నగరవనంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అటవి శాఖ అధికారి నాగమునేశ్వరి హాజరయ్యారు. అటవీ అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అధికారి నాగమునేశ్వరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్ కుమార్, ఉప అటవీ క్షేత్ర అధికారి రవీంద్ర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


అమరవీరుల దినోత్సవంలో పాల్గొన్న అటవీశాఖ జిల్లా అధికారి నాగమునేశ్వరి

నేపాల్ నుంచి స్వస్థలాలకు ప్రజలు

- వారిని తీసుకురావడానికి మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ
- కృతజ్ఞతలు తెలిపిన ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు


ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ చొరవతోనే నేపాల్‌లో చిక్కుకున్న వారు స్వస్థలాలకు చేరుకుంటున్నారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురు వారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఎప్పుడు ఎక్కడ అపద వచ్చినా వారిని ఆదుకోవడంలో టీడీపీ ముందు ఉంటుందని తెలిపారు. నేపాల్ మారణహోమంలో చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చడంలో కీలక పాత్ర వహించిన మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఓ ప్రకటన ద్వారా చెప్పారు. బాధితులతో స్వయంగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పడం, లోకేశ్ కోఆర్డినేటర్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించి ఢిల్లీలోని ఏపీ భవన్ ద్వారా అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయించడం, చిక్కుకున్న వారికి సురక్షితంగా తీసుకురావడం ఎంతో సాహసంతో కూడుకున్న పని అన్నారు. నేపా ల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా తీసుకు వచ్చేందుకు మంత్రి లోకేశ్ ప్రాధాన్యం ఇచ్చారని టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ప్రాధాన్యత అన్నారు. అయితే వైసీపీ నేత జగన్మోహన్ రెడ్డి కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు.

ఓర్వకల్లు: నేపాల్ పర్యటనకు వెళ్లి అక్కడ ఉద్రిక్తత పరిస్థితుల మధ్య చిక్కుకుపోయిన తెలుగువారు బాధితులకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో స్వగ్రామాలకు తీసుకొచ్చారని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని ఏపీ భవన్‌లో నిత్యావసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడం, చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, నీరు వసతి సదుపాయాలు కల్పించేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: నేపాల్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ కృషి చేశారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరు చరితారెడ్డి సమావేశం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో తెలుగు వారిని తీసుకొచ్చి వారి కుటుంబాల్లో సంతోషం నింపారన్నారు.

తెలుగు వారికి అండగా నిలవడంలో లోకేశ్ తీరు భేష్


నంద్యాల ఎంపీ శబరి

నంద్యాల రూరల్: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ఎప్పుడు ఎక్కడ ప్రమాదం వచ్చిన ఆదుకోవడంలో మంత్రి లోకేశ్ తీరు భేష్ అని ఎంపీ బైరెడ్డి శబరి ప్రశంసించారు. గురువారం ఆమె మాట్లాడుతూ నేపాల్‌లో అల్లర్లలో చిక్కుకున్న తెలుగు ప్రజలను ఏపీకి సురక్షితంగా తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతపురంలో జరిగిన సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని సైతం రద్దు చేసుకుని నేపాల్‌లో ఉన్నవారిని ఆదుకోవడంలోనే నిమగ్నమయ్యారన్నారు.

కన్నకొడుకును చంపేశాడు..!

పసిబిడ్డను నీటి డ్రమ్ములో ముంచి హత్య.. ఆపై భార్యపై దాడి ● దేవనకొండలో దారుణం

(ఆ బిడ్డకు మాటలు వచ్చి ఉంటే ఇలా అనేవాడేమో..)

ఎందుకు నాన్నా ఇలా చేశావు.. నా అల్లరి నీకు నచ్చలేదా? లేక నేనే నచ్చలేదా? నా పుట్టుకపై అనుమానమా? లేక అమ్మపై అనుమానమా?.. నువ్వు నన్ను ఎత్తుకుంటే మురిపెంగా ముద్దు పెట్టుకుంటావనుకున్నా కానీ ఇలా నీటిలో ముంచి చంపేస్తావనుకోలేదు నాన్నా. ఎంత పనిచేశావు డాడీ. నన్ను చంపే సమయంలో అమ్మ పేగు బంధం.. నీ ప్రాణబంధం గుర్తుకు రాలేదా? చివరగా ఒక్క మాట.. నేను నీ కొడుకునే నాన్న


ఉయ్యాలలో అచేతనంగా చిన్నారి సాగర్...


నిందితుడు, తండ్రి నరేష్

దేవనకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో ఓ భర్త కర్కశంగా వ్యవహరించాడు. ఎనిమిది నెలల కుమారుడిని హతమార్చి, భార్యపై విచక్షణా రహితంగా గాయపడిచారిచిన సంఘటన దేవనకొండ సమీపంలో చోటుచేసుకుంది. దేవనకొండకి చెందిన చాకలి నరేష్ మొదటి భార్య మూడేళ్ల క్రితమే మృతిచెంది, ఆమెకు ఇద్దరు కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనంతరం గోనెగండ్ల మండలం, కులుమాల గ్రామానికి చెందిన నర్సప్ప, సుజాత కుతూరు శ్రావణితో రెండేళ్ల క్రితం (రెండో) వివాహం జరిగింది. కాగా నెల నుంచి కుటుంబంలో అత్తమామ, మొదటి భార్య పిల్లలకు కలహాలు మొదలైన్నాయి. వీరు ఇంట్లో ఉండకూడదని ఘర్షణ చోటుచేసుకోవడంతో 20 రోజులు క్రితం నరేష్ రెండో భార్యను తీసుకుని దేవనకొండకి రెండు కిలోమీటర్ల దూరంలోని తమ ఎర్రచందనం పొలంలో ఉన్న గదిలోనే కాపురం సాగిస్తున్నారు. కాగా భార్యపై అనుమానం పెంచుకున్న నరేష్ గురువారం ఉదయం భార్యపై అనుమానంతో విచక్షణారహితంగా దాడిచేసి, తన 8 నెలల కుమారుడు సాగర్‌ను నీటి డ్రమ్ములో ముంచి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న సీఐ వంశీనాథ్ ఘటన స్థలానికి చేరుకొని, తీవ్రంగా గాయపడ్డ శ్రావణిని అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. శ్రావణి కుటుంబ సభ్యులు బాలుడు సాగర్ మృత దేహంతో న్యాయం చేయాలని దాదాపు మూడు గంటల లపాటు పత్తికొండ, దేవనకొండ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయ్యాయి. సీఐ జోక్యం చేసుకుని విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాలుడి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రావణి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


భర్త దాడిలో గాయపడ్డ శ్రావణి

మట్టితో అడ్డుకట్ట


ఎక్సవేటర్ ద్వారా మట్టి వేసి గండి పూడ్చివేత

మద్దికెర మండలంలోని ఎడవలి గ్రామ శివారులో హంద్రీనీవా కాలువ నిండుకుండలా ప్రవహిస్తోంది. నీరు గట్టుపైకి వస్తుండటంతో గండి పడుతుందోనన్న అనుమానంతో రైతులు, ప్రజలు స్పందించారు. గురువారం ఉదయం నుంచే ఎక్స్‌కవేటర్ ద్వారా మట్టితో అడ్డుకట్ట వేశారు. హంద్రీనీవా కాలువ కింద వేల ఎకరాలు ఉండటమే కాకుండా బొమ్మనపల్లి గ్రామం కూడా ఉంది. హంద్రీనీవా కాలువకు ప్రమాదం పొంచి ఉందని, కాలువగట్టుపైన నీరు పారుతుందని అధికారులకు సమాచారమమిస్తే నిర్లక్ష్యం చేశారని, గ్రామానికి చెందిన నంది జయరాముడు, ఓబులేసు ఆరోపించారు.

● మద్దికెర, ఆంధ్రజ్యోతి

ముగ్గురి అరెస్టు

డోన్ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వ్యాపారిని బలవంతంగా అడ్డుకుని, బెదిరించి జులుం ప్రదర్శించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. గురువారం నిందితులను అరెస్టు చేసి సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, ఏఎస్ఐ బాస్కర్‌లు విలేకరులకు సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డోన్ పట్టణానికి చెందిన గొల్ల రఘు అలియాస్ జామకాయల రవి, చిగురుమానుపేటకు చెందిన గుండెపోగు అబ్బాస్, పాతపేటకు చెందిన ఉప్పరి సురేంద్ర పట్టణంలో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం చేస్తున్న సయ్యద్ నూర్ బాషాను బలవంతంగా అడ్డుకుని, జులుం ప్రదర్శించారు. నూర్ బాషాకు చెందిన వెయింగ్ మిషన్లను తీసుకెళ్లడమే కాకుండా తమ అనుమతి లేకుండా వ్యాపారం చేయవద్దని హుంకుం చేశారు. నూర్ బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం వారిని అరెస్టు చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఉల్లి పంటను కాపాడుకోవాలి

- ఉద్యానశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో ఉల్లి పంటకు అధిక వర్షాల ముప్పు పొంచి ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండి పంటను కాపాడుకోవాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు రైతులకు సూచించారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉల్లి పంటలో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలని, ఉల్లినారును ఎత్తయిన నారుమళ్లలో వేసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు, తుఫాన్ సమయంలో కొట్టుకుపోయిన నారుమళ్లను తిరిగి ఎత్తయిన నారుమళ్లలో నాటుకోవాలన్నారు. నారుమళ్లకు 3 గ్రాముల కాపర్ యాక్సి క్లోరైడ్ గానీ, అలైట్ ఒక గ్రాము మందును లీటరు నీటికి కలిపి తడిపితే కుల్లు తెగుళ్లు ఆశించదని తెలిపారు. రెండు, మూడుసార్లు 0.5శాతం పొటాషియం నైట్రేడ్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పంటపై పిచికారీ చేయాలన్నారు. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయన్నారు. ప్రధాన పొలంలో పంట వయస్సు 45 రోజుల్లోపు ఉన్నట్లయితే వర్షం ఆగిన తర్వాత లైటుగా పోయింగ్ చేసి పైపాటిగా ఎకరాకు 60 కిలోల యూరియాను 20 కిలోల న్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎరువులను కలిపి చల్లాలన్నారు. ఆకులు కత్తిరించు పురుగుల నివారణకు 5 శాతం వేపగింజల కషాయాన్ని లాండా సైహాలోత్రిన్ 1.5 మి.లీ.ను ఒక లీటరుకు కలిపి పిచికారీ చేయాలన్నారు. శనగపచ్చ పురుగు నివారణకు హెచ్ఎన్‌పీవీ ద్రావణాన్ని పిచికారీ చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సూచించారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి సాయం

సంజామల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాల గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త దానియేలు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. దానియేలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు జనసేన సభ్యత్వం ఉండడంతో ప్రమాద బీమా వర్తించింది. దీంతో ప్రమాద బీమా అధికారులు జనసేన నాయకుడు పీవోసీ పత్తి సురేశ్‌బాబు చేతుల మీదుగా గురువారం దానియేలు భార్యకు రూ.5 లక్షల చెక్కును అందించారు. కోఆర్డినేటర్ వేణు, వలంటీర్ మహబూబ్, జనసేన పార్టీ నాయకులు భాస్కర్, ఇమామ్, షేక్షావలి, రాజు, కులాయప్ప, గుర్రప్ప పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పశువుల మార్కెట్ దగ్గర కూల్‌డ్రింక్స్ దుకాణంలో విద్యుదాఘా తంతో గోపీకృష్ణ(13) అనే బాలుడు మృతి చెందాడు. వివరాలివీ.. పట్టణంలోని గంజల్ల రోడ్డులో నివాసం ఉంటున్న వెంకటేశ్ గౌడ్‌కు ఇద్దరు కుమారులు. గోపీకృష్ణ పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వీరికి పశువుల మార్కెట్ గేట్ దగ్గర కూల్ డ్రింక్స్ షాపు ఉంది. రోజు మాదిరిగానే గురువారం దుకాణాన్ని తెరిచాడు. ఈక్రమంలో సర్వీస్ వైరును అప్పటికే ఎలుకలు కొద్దిగా కొరకటంతో కాపర్ వైర్ దుకాణం రేకులకు తగిలి ఉంది. రేకుల పక్కనే ఫ్రిజ్ ఉంటంతో దాన్ని తెరిసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వటంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు.

గర్భిణి మృతి

- ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణి మృతి చెందింది. దీంతో ఆమె బంధువులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. చిన్న పెండెకల్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య లింగమ్మ(27) ప్రసవం కోసం బుధవారం పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. గురువారం సిజేరియన్ చేస్తామని వైద్యులు చెప్పారు. శస్త్రచికిత్స కోసం సిద్ధం చేసుకున్న సమయంలో సీరియస్‌గా ఉందని చెప్పి ఆదోనిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో గర్భిణి బంధువులు హుటాహుటిన ఆదోనికి తీసుకెళ్లారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందిందని చెప్పారు. దీంతో మృతదేహంతో ఎమ్మిగనూరుకు వచ్చి ప్రైవేటు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. పట్టణ పోలీసులు ఆసుపత్రి దగ్గరకు చేరుకొని విచారించారు.

మద్యం సీసాలు స్వాధీనం

పగిడ్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రాతకోట గ్రామానికి చెందిన పులికంటి మద్దిలేటి అనే వ్యక్తి అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తుండటంతో గురువారం పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ మద్దిలేటి సంతమార్కెట్ సమీపంలో మద్యం విక్రయిస్తుండగా ముచ్చుమర్రి ఏఎస్ఐ శేషయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. మద్దిలేటి నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

శ్రీశైలం: శ్రీశైలంలో స్థానిక ఒకటవ పట్టణ పోలీసులు గతంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను గురువారం ధ్వంసం చేశారు. శ్రీశైలం ఒకటవ పట్టణ సీఐ జి.ప్రసాదరావు మాట్లాడుతూ పట్టుబడిన వాటిలో సారా, ఏపీ, తెలంగాణ మద్యం ఉందన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

మతిభ్రమించి మాట్లాడుతున్న జగన్

- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజం



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ మతిభ్రమించి మాట్లాడుతు న్నారని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభను చూసి జగన్‌కు మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండి పడ్డారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌ను మూసినదిలో వేయాలని మాట్లాడతారా.? అని ఆగ్ర హం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పరిశ్రమలు తరలి వస్తుండడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. జగన్ హయాంలో రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేసి ఎంతో మంది నిరుద్యోగుల ప్రాణాలను బలితీసుకున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి వారు రాజకీయాలకు పనికిరారని, ప్రజల సొమ్ము దోచుకుని హైదరాబాద్, బెంగళూరు, లండన్‌లో ప్యాలెస్‌లు కట్టుకున్నారని, ఎక్కడో ఒకచోట విశ్రాంతి తీసుకుంటే మంచిదని సూచించారు.

మణేకుర్తిలో కనకదాసు విగ్రహం ధ్వంసం

ఆలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మణేకుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన భక్త కనకదాసు విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి చెయ్యి విరిగొట్టారు. గురువారం ఉదయం గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ మహబూబ్‌బాషా, పోలీస్ సిబ్బంది విచారించారు. కురువ సంఘం నాయకులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. భారీ ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విగ్రహం చెయ్యి విరగొట్టిన దుండగులను గుర్తించి అరెస్టు చేయాలని ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషాకు ఫిర్యాదు చేశారు. అనంతరం అంబేడ్కర్ కూడ లిలో రాస్తారోకో చేపట్టారు. కురువ సంఘం నాయకులు దేవేంద్ర, గిరి, మల్లికార్జున మాట్లాడుతూ పోలీసులు దర్యాప్తు చేసి, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అయ్యాలప్ప, మహానంది, నాగేంద్ర, మంగన్న, రాజు, చంద్ర, ఉల్లెప్ప పాల్గొన్నారు. మణేకుర్తిలో భక్త కనకదాసు విగ్రహం ధ్వంసంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పందించారు. ఈ చర్యకు పాల్పడిన వారు ఎవరైనా సరే గుర్తించి అరెస్టు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను ఆదేశించారు.


ధ్వంసమైన కనకదాసు విగ్రహం

హెచ్.కొట్టాలలో ఆరు ఇళ్లలో దొంగతనాలు

- భయాందోళనలో ప్రజలు

బేతంచెర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఒకేసారి ఆరు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. గ్రామ ప్రజలు, ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయపాట రవిశంకర్, ఎండూరి తిరు పాలు, ఉన్నం ధనుంజయ, ఎండూరి మోహన్‌రావు, చికెన్ బాషా, మంజు అరుణ ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బోయపాటి రవిశంకర్ తన కుమార్తె ఆరోగ్యం బాగలేక పోవడంతో చికిత్స కోసం బెంగళూరు వెళ్లగా ఆయన ఇంటి తాళాలు పగులకొట్టి రెండు బీరువాలో ఉన్న నల్లపూసల దండ, 2 చైన్లు, నెక్లెస్, నాలుగు ఉంగరాలు, లక్ష్మీబిళ్ల, మూడు జతల బంగారు కమ్మలు, చెంపచెరాలతో కలిపి మొత్తం సుమారు 12 తులాల బంగారు, 10 తులాల వెండి, రూ.20 వేల నగదు చోరీ చేశారు. లారీ డ్రైవర్ ధనుంజయ డ్యూటీకి వెళ్లగా ఆయన ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలో ఉన్న రూ.72వేల నగదు, ఎండూరి తిరుపాలు ఇంట్లో 3 సెల్‌ఫోన్లు, చికెన్ బాషా ఇంట్లో రూ.1,200 నగదు, ఎండూరి మోహన్‌రావు ఇంట్లో తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఏమీ లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. అలాగే మంజు అరుణ తన తల్లి సాలమ్మ ఇంటికి వెళ్లి నిద్రిస్తుండగా.. ఇంటి తాళాలు పగులకొట్టి ట్రంకు పెట్టెలో ఉన్న 3తులాల బంగారు, 16 తులాల వెండి, రూ.లక్ష నగదు చోరీ చేశారు. ఎస్ఐ రమేష్ బాబు తన సిబ్బందితో చోరీ జరిగిన ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సదస్సును జయప్రదం చేయాలి: ఏఐవైఎఫ్



పోస్టరును విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ అధ్వర్యంలో ఈ నెల 17న విజయవాడలో జరిగే నిరుద్యోగుల ఆవేదన సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో సద స్సుకు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర గందర గోళంగా పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనికి కూటమి ప్రభుత్వమే కారణమని విమ ర్శించారు. సూపర్ సిక్స్..సూపర్ హిట్ అనే నినాదంతో ఆర్భాటాలు చేస్తున్నారే తప్ప నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఈ నెల 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు నిరుద్యోగుల ఆవేదన సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో యువతీ, యువకులు, నిరుద్యోగులు హాజరుకావాలని అన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి బీసన్న, నగర అధ్యక్షుడు బి.నాగరాజు, నాయకులు శ్రీకాంత్, సురేంద్ర యాదవ్, ప్రభాకర్, శ్రీనివాసులు, సూర్య, మధు పాల్గొన్నారు.

డయాలసిస్ యంత్రాలు ప్రారంభం



డయాలసిస్ యంత్రాల ప్రారంభోత్సవంలో సూపరింటెండెంట్, నెఫ్రాలజీ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.15 లక్షలతో నెఫ్రాలజీ విభాగంలో రెండు ఆధునాతన డయాలసిస్ యంత్రాలను సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతున్న నెఫ్రాలజి విభాగంలో ప్రతి నెల 350 మందికి డయాలసిస్ సేవలు అందిస్తారని, కొత్తగా ఏర్పాటు చేసిన రెండు యంత్రాలతో రోగులకు నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, నెఫ్రాలజి విభాగపు హెచ్‌వోడీ డా.అనంత్, సీనియర్ ప్రొఫెసర్ డా.పీఎస్ జిక్కి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.వెంకట పక్కీరెడ్డి, డా.శ్రీధర్ శర్మ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

ఓర్వకల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలు అందించడంతోనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఏపీడీ పద్మావతమ్మ అన్నారు. గురువారం ఓర్వకల్లులోని ఉపాధి హామీ కార్యాలయంలో పదోన్నతిపై వెళుతున్న ఓర్వకల్లు ఎంపీడీవో శ్రీనివాసులు సన్మాన సభ జరిగింది. ఈ సభకు ఏపీవో మల్లేశ్వరమ్మ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఏపీడీ పద్మావతమ్మ హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో ఎంపీడీవో శ్రీనివాసులు నిక్కచ్చిగా వ్యవహరించేవారన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటరమణయ్య, ఉపాధి, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా : రైతు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తన పొలం గట్టు వెంట తవ్వించుకున్న కాలువను రోడ్డు నిర్మాణ పనుల్లో పూడ్చివేసి స్పందించని కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రైతు, లద్దగిరి గ్రామ సర్పంచ్ పట్టె హనుమంతు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తన నాలుగెకరాల పొలంలో పత్తి, కంది సాగుతోపాటు మామిడి, కొబ్బరి మొక్కలు పెంచుతున్నానని తెలిపారు. గురువారం భారీ వర్షం కురవడంతో ఎగువ నుంచి వచ్చిన వర్షపు నీరు ముందుకు వెళ్లే దారిలేక పంటలో చేరిందని అన్నారు. దీంతో సొంత ఖర్చు రూ.11 వేలు ఖర్చు చేసి కాలువను తవ్వించుకున్నట్లు తెలిపాడు.

భక్త కనకదాసు విగ్రహ ధ్వంసం దుర్మార్గం: ఎంపీ నాగరాజు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో భక్త కనకదాసు విగ్రహం ధ్వంసం చేయడాన్ని ఎంపీ బస్తిపాటి నాగరాజు ఖండించారు. గురువారం ఘటనపై గ్రామస్థులతో ఆయన ఫోన్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామంలో గొడవలు సృష్టించేందుకు కొందరు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కర్నూలు జిల్లా కురువ సంఘం అధ్యక్షులు పత్తికొండ శ్రీని వాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా మహిళా సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సి.లీలమ్మ, అనితమ్మ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కల్లూరు: ఆలూరులో కురువల ఆరాధ్యదైవం భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమని కురువ సంఘం జిల్లా నాయకులు అన్నారు. గురువారం కర్నూలు జిల్లా గొర్రెలకాపరుల సొసైటీ చైర్మన్ కె.శ్రీనివాసులు, కల్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులంకాటి శేఖర్, కల్లూరు మాజీ జడ్పీటీసీ పర్ల సుంకన్న విగ్రహం ధ్వంసం చేయడాన్ని ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

ఫుట్‌బాల్ పోటీలు వాయిదా

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు వర్షం కారణంగా వాయిదా వేశామని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి టి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఎంపిక తేదీ తర్వాత ప్రకటిస్తామన్నారు.

నేడు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో బాలబాలికలకు శుక్రవారం జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కుబేర్ నాయుడు, విజయకుమార్ తెలిపారు. 1.1.2011 తర్వాత జన్మించిన వారు అర్హులని, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. వివరాలకు 8499960254 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

14న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవనగర్‌లోని గుడ్ షెప్పర్డ్ పాఠశాలలో ఈనెల 14న 17వ రాష్ట్ర స్థాయి మిని సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అండర్-12 బాలబాలికల విభాగంలో చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నా మని, పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏపీ జట్టుకు ఎంపిక చేయను న్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో జరిగే 17వ జాతీయస్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా పార్కు

- పార్కులో ఎక్కడ చూసినా మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు
- చెల్లాచెదురుగా వ్యాయామ పరికరాలు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్దా మార్కెట్ సమీపంలో ఉన్న పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ వాసవీ కళాశాలతోపాటు ముస్లింలు ప్రార్థించే మర్కజ్ పెద్ద మసీదు ముందు పార్కులోనే మందుబాబులు యథేచ్ఛగా మందు తాగుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కులో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వస్తుంటారు. ఆహ్లాదాన్ని పెంచాల్సిన అధికారులు ఆ దిశగా అభివృద్ధి చేయకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వాకింగ్ వచ్చే వారికి రాత్రి సమయాల్లో తాగి పడేసిన మందు సీసాలు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి. నగర ప్రజల నుంచి పన్నులను ముక్కు పిండి వసూలు చేస్తున్న పాలకమండలి, అధికారులు పార్కును ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. పార్కులో వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన పరికరాలు అన్ని కూడా విరిగిపోయి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కమిషనర్ స్పందించి మందుబాబుల నుంచి పార్కును రక్షించి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పార్కులో మందు బాబులు తాగి పడేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, విరిగిపోయిన వ్యాయామ పరికరాలు

పార్కును ఆధునికీకరించాలి

పార్కును ఆహ్లాదవాతావరణలో ఆధునికీకరించాలి. ఎప్పటి నుంచో చెబుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. తూతూ మంత్రంగా పార్కులో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. పచ్చదనం కోసం మొక్కలు నాటలేదు. ఉదయం వాకింగ్ వచ్చే వారికి మద్యం సీసాలు అడ్డుగా వస్తున్నాయి. అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలి.

● ఎస్ఎండీ షరీఫ్, సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు

అధికారులు మొద్దునిద్ర వీడాలి: ఎమ్మెల్యే

కల్లూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మొద్దునిద్ర వీడి రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రజలకు తాగునీరు అందించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.శారద అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయా శాఖల మండల అధికారులు సభలో ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఉలిందకొండ గ్రామంలో 4 రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారని సింగిల్‌విండో అధ్య క్షుడు ఈవీ రమణ ఎమ్మెల్యేకు వివరించారు. బీసీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైందన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ మం డల అభివృద్ధి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అధికారులు ఉలిందకొండ గ్రామంలో పర్యటించి తాగునీటి సమస్యను పరిష్క రించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.నాగేశాచలరెడ్డి, తహసీల్దారు కె.ఆంజనేయులు, కల్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడు దేవలంకాటి శేఖర్ ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న ఈవీ రమణ

పౌరులందరూ ఓటు హక్కును పొందాలి

కర్నూలు నియోజకవర్గ ఆర్వో విశ్వనాథ్



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్వో విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పౌరులందరూ ఓటు హక్కును పొందాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. గురువారం నగర పాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా ఫారం 6, 7, 8లను వినియోగించుకోవాలని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా రాజకీయ పార్టీలతో 8 సమావేశాలు నిర్వహించి, సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరితగతిన బూత్ ఏజెంట్ల జాబితాను సమర్పించాలన్నారు. సమావేశంలో అర్బన్ తహసీల్దారు రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

వీధులన్నీ శుభ్రంగా ఉంచాలి: నగరంలోని వీధులన్నీ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర పాలక కమిషనర్ విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పాలక కార్యాలయంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా చెత్త కుప్పలు పేరుకుపోకుండా గార్బేజ్ పాయింట్లను పూర్తిగా తొలగించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కు మార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఓపెన్ ఫోరం

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రణాళిక సమస్యలపై శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎస్‌బీఐ కాలనీలోని కౌన్సిల్ సమావేశం భవనం లో పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించిన ఎల్‌ఆర్ఎస్, నిర్మాణ అనుమతులు వంటి సేవల్లో తలెత్తుతున్న ఇబ్బందులపై పౌరులు తమ సమస్యలను నేరుగా చెప్పవచ్చన్నారు. పౌరుల ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

రెసిడెన్షియల్ కళాశాలకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉర్దూ జూనియర్ రెసిడెన్షియల్ కళాశాలకు రక్షణ కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎంఎండీ నూర్ కోరారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఒక వైపు త్రిగుణ బార్ అండ్ రెస్టారెంట్, మరో వైపు మల్లికార్జున బార్ అండ్ రెస్టారెంట్ మధ్యలో మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీ, పక్కన అనాథ పిల్లల ప్రభుత్వ ఆశ్రమం ఉన్నాయన్నారు. చుట్టుపక్కల లాడ్జిల్లో సాయంత్రం వేళల్లో మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జిల్లా మైనార్టీ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్ మెంట్ ప్రధాన కార్య దర్శి రజాక్ వలి, సయ్యద్ ఖాద్రీ, సయ్యద్ వసీబాషా పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు అమలు చేస్తే దాడులా..?

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): క్వార్టర్స్ ఖాళీ చేయించాలన్న అధికారుల ఆదేశాలు అమలు చేస్తే దాడులు చేస్తారా అంటూ అర్ అండ్ బీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కిరణ్ గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. విధులు నిర్వహిస్తున్న ఆర్‌అండ్‌బీ సీనియర్ అసిస్టెంట్ ఆర్‌వీ రమణపై కక్ష పూరి తంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. జమీలా, సునీతతోపాటు మిగిలిని వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌వీ రమణ ఆటోలో మైక్ ద్వారా ప్రకటనలను చేస్తూ తిరుగుతుండగ ముందస్తు పథ కం ప్రకారం ఆటోను అడ్డగించి దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డున పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 15న తలపెట్టిన చలో విజయజవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం జొహరాపురంలో ప్రచారం నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కోసం కార్మికులంతా కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. నాయకులు మద్దిలేటి, రంగస్వామి, మధు, సుధాకర్, తిప్పన్న పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 14న విజయవాడలో చేపడుతున్న రాష్ట్రస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయా లని ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జనగణనలో కులగనణ చేపట్టాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

కల్లూరులో భారీ వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- పర్ల, తడకనపల్లె గ్రామస్థుల అవస్థలు

కల్లూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో గురువారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కల్లూరు మండలంలో 4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎగువన గూడూరు, సి.బెళగల్‌లో కురిసిన వర్షానికి వక్కెర వాగుకు వరద పోటెత్తింది. పర్ల గ్రామం ఊరి చివరన వక్కెరవాగు బ్రిడ్జిపై వరద ప్రవహిస్తూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సల్కాపురం గ్రామంలో వక్కెర వాగు ప్రమాదకరంగా మారింది.. అంతేకాకుండా చిన్నటేకూరు బిట్స్ కళాశాల సమీపంలోని రైల్వేబ్రిడ్జి కింద వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో తడకనపల్లె గ్రామానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంట పొలాల్లో వర్షం నీరు నిలవడంతో పత్తి, మొక్కజొన్న రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



పర్ల వక్కెర వాగు బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద, చిన్నటేకూరు బిట్ కళాశాల వద్ద రోడ్డుపై వాగు ఉధృతి

మద్యం స్వాధీనం

కోడుమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం మల్లాపురం గ్రామంలోని బస్‌స్టాండ్ దగ్గర ముగ్గురు వ్యక్తుల నుంచి ఇతర రాష్ట్రాలకు సంబంధించిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.మంజుల తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం ఆమె మాట్లాడుతూ గోవా, కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన మద్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం మేరకు మల్లాపురం గ్రామానికి వెళ్లి దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు కారులో గోవా మద్యం బాటిళ్లతోపాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన 16 టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మల్లాపురం గ్రామానికి చెందిన చిన్న మినెల్ల, పర్ల గ్రామానికి చెందిన చింతకాయల రమేష్, కల్లూరుకు చెందిన తలారి కృష్ణను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి కారు, మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలందరికీ ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) అధికారి డా.మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. గురువారం కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అసంక్రమిత వ్యాధుల ఎన్‌సీడీ-4 కింద క్యాన్సర్ వ్యాధిపై సామాజిక అధికారులు, పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రాల్లో పని చేసే ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. నోటి, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్, స్కీనింగ్ పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డా.నాగరాజు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో వైద్యులు సాహితి జయరాం, వెంకట సుబ్బనాగరాజు, విజయభాస్కర్, డెంటల్ డాక్టర్ హడస్సా, డా.సుధాకర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: జేఏసీ

కోడుమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఎంపాయీస్ కర్నూలు డివిజన్ జేఏసీ చైర్మన్ మధుకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రాములవారి ఆలయంలో గురువారం విద్యుత్ ఎంప్లాయిస్, కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. మధుకుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు పనికి తగిన వేతనం అందించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, పాత పద్ధతిలో కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో విద్యుత్ ఉద్యోగ, కార్మికులు మధుకృష్ణ, సురేష్‌కుమార్, దేవకు మార్, మహమ్మద్ రఫీ, గోపికృష్ణ, రజనీకాంత్, మల్లికార్జున పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి: చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని చేనేత జిల్లా కార్యదర్శి రాజు పిలుపు నిచ్చారు. సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన మా ట్లాడుతూ ఈనెల 14న నాగలదిన్నెలో నిర్వహించే మహాసభకు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతున్నారన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించండి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ట్రిపుల్ ఐటీ డీఎం ఆధ్వ ర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం ప్రొఫెసర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను రూపొందించడం పూర్త యిన నేపథ్యంలో ఒక గ్రామంలో డ్రోన్‌పై అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

కల్లూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను అడ్డుకుంటామని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూ పాల్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూరియా దొరక్క రైతులు అల్లాడుతుంటే సమస్యలపై ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు ఇవ్వండా అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు రూ.250 కోట్ల యూరియా స్కాం జరిగిందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకువచ్చి 17 మెడికల్ కాలేజీల పనులు మొదలు పెట్టి, 2023-24 మధ్య ఐదు కాలేజీలను ప్రారంభించామని, పులివెందుల, పాడేరు కాలేజీలు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ సంపద లక్ష కోట్ల విలువైన ఆస్తులను ప్రైవేట్‌పరం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేవీఆర్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం జేఎన్‌టీయూ కళాశాల్లో జరిగిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్‌లో కర్నూలు కేవీఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ద్వితీయ బహు మతిని గెలుచుకొని అమరావతిలో జరిగే ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి విద్యార్థినులను, వారికి ప్రోత్సహించిన భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు ఎం.పద్మావతిని అభినందించారు.

జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవాలి

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి టి.కృష్ణ అన్నారు. కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికలకు ఉషూ కురేష్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. 200 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు కె.నాగేశ్వరి, వెంకటేశ్వర్లు, శేఖర్, మల్లికార్జున, డీఎస్ఏ సిబ్బంది ఇర్ఫాన్, గంగాధర్, పీడీలు కిరణ్, నాగరాజు, సురేష్‌గౌడు, సుప్రియ, సురేష్, గీతాంజలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మా రూటే.. సపరేటు

రాంగ్ రూట్‌లో వాహనాల రాకపోకలు

- లారీ ప్రమాదంలో విద్యార్థులు గాయపడినా కనువిప్పు కలగదా?
- ప్రాణాలుపోతే గాని పట్టించుకోరా..?
- భయాందోళనలో ప్రయాణికులు, విద్యార్థులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టీల్ ప్లాంట్‌కు వెళ్లే భారీ వాహనాలు మా రూటే వేరు అన్న చందంగా నిత్యం రాంగ్ రూట్‌లో రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఉక్కు పరిశ్రమలో ఇనుము తయారు చేసేందుకు అవసరమయ్యే ముడి సరుకును దిగుమతి చేసేందుకు కర్నూలు, నంద్యాల వైపు నుంచి జాతీయ రహదారి మీదుగా భారీ వాహనాలు ప్రతి రోజూ స్టీల్ ప్లాంట్‌కు వెళ్తుంటాయి. తిరిగి వేళ్లే క్రమంలో నంద్యాల వైపు వెళ్లే వాహనాలు నిత్యం రాంగ్ రూట్‌లో వెళుతున్నాయి. రహదారి నియమాల ప్రకారం జాతీయ రహదారి పక్కన స్టీల్ ప్లాంట్ రోడ్డు నుంచి ఒక మైలు దూరంలోని రాక్ గార్డెన్ వద్ద యూటర్న్ తీసుకుని వెళ్లాలి. అయితే ఇందుకు విరుద్ధంగా పోలీస్ స్టేషన్ సమీపంలో యూటర్న్ తీసుకుని వెళ్తున్నారు. ఈ మార్గంలో ఒక ప్రభుత్వ కళాశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విద్యా ర్థులు పాఠశాలలకు ఆటోల్లో ప్రయాణిస్తూ ఉంటారు. స్టీల్ ప్లాంట్ భారీ వాహనాలు నిత్యం వ్యతిరేక మార్గంలో వెళుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో నని విద్యార్థులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల స్థానిక జాతీయ రహదారిపై శేషయ్య హోటల్ వద్ద ఒక లారీ వ్యతిరేక మార్గంలో వచ్చి ఆటోను ఢీకొనడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అయితే సంబంధిత అధికారులెవ్వరూ ఈ విషయం గురించి పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్టీల్ ప్లాంట్ భారీ వాహనాలు సక్రమ మార్గంలో వేళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



హైవేపై రాంగ్ రూట్‌లో వెళ్తున్న భారీ వాహనాలు

దంచికొట్టిన వాన

- పత్తికొండ, ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో భారీ వర్షం
- హాలహర్వి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి
- చిప్పగిరిలో కూలిన మిద్దె


మద్దికెరలో నీట మునిగిన కంది పంట

మద్దికెర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం తెల్లవారుజాము 1 గంట నుంచి ఉదయం 6 గంటల వరకు ఏకధాటి వర్షం కురిసింది. ఒకే రోజు 97.8 మి.మీల వర్షం నమోదు కావడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఉల్లి, కంది పంటలు నీట మునిగాయి. మద్దికెర నుంచి వయా బురుజుల మీదుగా మద్దికెర శివారులోని సుద్దబాయి వంక ఉదయం నుంచి పొంగి ప్రవహించింది. దీంతో మద్దికెర, వయా బురుజుల పత్తికొండ మీదుగా రాకపోకలు మధ్యాహ్నం వరకు నిలిచిపోయాయి. అలాగే బురుజుల గ్రామ శివారులోని కాలువ పొంగడంతో పొలాలు నీట మునిగాయి. మండలంలో దాదాపు 5వేల ఎకరాల్లో కంది, 500 ఎకరాల్లో ఉల్లి పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. పెరవలి గ్రామంలో చెరువు నిండింది. పంట నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తుగ్గలి: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసంది.వర్షానికి వంకలు, వాగులు, కాలువలు నిండి పారాయి. ఉప్పర్లపల్లి గిరిజన తండాలు అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలో 45.4 మి.మీ.ల వర్షం నమోదైంది. ఉప్పర్లపల్లి ప్రధాన రహదారిలో వంక పొంగి పొర్లడంతో ప్యాపిలి, జొన్నగిరి తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

హాలహర్వి: మండలంలో 62.2 మి.మీ. వర్షపాతం నమోదయింది. వేదవతి నది ఉధృతంగా ప్రవహించింది. నిట్రవట్టి వద్ద పెద్దవాగు ఉగ్రరూపం దాల్చడంతో రాకపోకలు స్తంభించాయి. మెదేహాల్ గంగమ్మ వాగు ఉధృతికి సమీపంలో ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. తహసీల్దార్ లక్ష్మీనారాయణ పొలాలను పరిశీలించారు. గూళ్యం వద్ద నదికి భారీ వరద రావడంతో రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు పుట్టిలో ప్రయాణించారు.

ఆస్పరి: మండలంలో మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దీంతో పలు గ్రామాల్లో సాగుచేసిన పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ, టమాటా, కంది తదితర పంటలు నీట మునిగాయి.

ఆలూరు(చిప్పగిరి): చిప్పగిరి మండలంలో గురువారం ఉదయం వరకు కురిసిన వర్షానికి నంచర్ల గ్రామంలోని రాముకు చెందిన మట్టి మిద్దె కూలింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. గ్రామంలో వర్షపునీరు వీధుల్లో పారింది. కాలనీలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బురదమయంగా మారింది.



తుగ్గలి: ఉప్పర్లపల్లి వద్ద వంక.. చిప్పగిరి మండలం నంచర్లలో కూలిన ఇల్లు


మద్దికెర: పొంగి ప్రవహిస్తున్న సుద్దబాయి వంక


హాలహర్వి మండలంలో వేదవతి నదిలో పుట్టి ప్రయాణం


ఆస్పరిలో పత్తి పంటలో వర్షపునీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గూండాల్ నాయక్ సూచించారు. గురువారం తెల్లవారుజాము భారీ వర్షం కురవడంతో హంద్రీనీవా కాలువను పరిశీలించారు. లోతట్టు, కాల్వగట్టు ప్రాంతాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత గృహాల్లో నివాసమున్న వారు మరింత జాగ్రత్త ఉండాలన్నారు. పంట నష్టం వివరాలను వీఆర్వోల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం బురుజుల రహదారి వద్ద సుద్దబాయి వంక వద్దను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రషీద్, స్వర్ణలత తదితరులు ఉన్నారు.


హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న తహసీల్దార్ గూండాల్ నాయక్

ఆత్మహత్య పరిష్కారం కాదు


మాట్లాడుతున్న సైకాలజిస్ట్ డాక్టర్ చైతన్యకుమార్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని మానసిక వైద్యుడు డాక్టర్ చైతన్య నేరెళ్ల, విశ్రాంత గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీ లత అన్నారు గురువారం పట్టణంలోని ఎన్‌జీవో భవనంలో సంఘం అధ్యక్షురాలు ఉషారాణి ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ సదస్సు నిర్వహించారు. ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో ఎక్కువమంది యువత ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రేమ విఫలమై, చెడు వ్యసనాలకు బానిసలైన వారు ఆత్మహత్యలు చేసుకోవడంతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి స్నేహం, యోగాతో ఒత్తిడిని జయించవచ్చు న్నారు. సెక్రెటరీ బజారీ, ఎల్ఐసీ ప్రకాష్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి భాషా, సభ్యులు మంజునాథ్, వెంకటేశ్వర్లు, తామస్, సురేష్ మల్లికార్జున గౌస్ పీరా లక్ష్మీ శ్రీధర్ నాగేంద్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యాసిన్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌తో సంబంధం లేదు

ఆదోని, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్‌లతో తమకు సంబంధంలేదని టిప్పర్ యజమానులు చేకూరి శ్రీకాంత్‌చౌదరి, రంగన్న అన్నారు. గురువారం మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే పార్థసారథి వైసీపీ నాయకులను పక్కన పెట్టుకొని నిజాలు తెలుసుకోకుండా తమపై ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. 15 ఏళ్లుగా టిప్పర్లను అద్దెకు మాత్రమే నడుపుతున్నామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా ఎమ్మెల్యే మాట్లాడడంపై సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.


మాట్లాడుతున్న టిప్పర్ల యజమాని శ్రీకాంత్‌చౌదరి

కురువ సంఘం అధ్యక్షుడిగా మల్లికార్జున



మద్దికెర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గడ్డం మల్లికార్జున మండల కురువ సంఘం అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. గురువారం పట్టణంలో కురువ సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కురువ సంఘం అధ్యక్షుడు సోమలింగ, తాలుకా అధ్యక్షులు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి


సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీ టీచర్లు

దేవనకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల హక్కుల కోసం పోరాడాలని యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ పేర్కొన్నారు. గురువారం దేవనకొండలో మండల మహాసభ నిర్వహించారు. ఐక్య పోరాటాలతోనే హక్కులను సాధించుకోవచ్చన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేసి, పదోన్నతి పొందిన అంగన్‌వాడీలకు పింఛన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మాబున్ని, కార్యదర్శిగా ఎర్రమ్మ, ఉపాధ్యక్షురాలిగా భార్గవి, సహాకార్యదర్శిగా గంగమ్మ, లక్ష్మిని ఎన్నుకున్నారు.

- పి.కోటకొండకు చెందిన సెక్టారు అంగన్‌వాడీ టీచర్లు, దేవనకొండకు చెందిన మరికొందరు ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలోకి చేరినట్లు నాయకురాలు శ్రీదేవి తెలిపారు.

ఒత్తిడిని జయిస్తేనే విద్యలో రాణిస్తారు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాగరాజు

తుగ్గలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఎత్తిడిని జయిస్తేనే విద్యలో రాణిస్తారని వ్యక్తిత్వ వికాస నిపుణుడు నాగరాజు, హెచ్‌ఎం వెంకటలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని జొన్నగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమస్యలను పట్టించుకోవద్దని, మానసిక ప్రశాంతతతో రుగ్మతలకు గురి కాకుండా విద్యను అభ్యసిస్తే విద్యలో రాణిస్తారన్నారు. రాజమోహన్, సలోమి, భాస్కర్ నాయక్, సీఆర్పీ నాగేష్ తదితరులు ఉన్నారు

విగ్రహం ధ్వంసం దారుణం

హాలహర్వి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం మణేకుర్తి గ్రామంలో కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని బీజేపీ మండలాధ్యక్షుడు బసవరాజు అన్నారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం డిమాండ్ చేశారు. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. పోలీసులు దుండగను పట్టుకుని శిక్షించాలన్నారు.

స్వయం ఉపాధి పొందాలి

- కుట్టు మిషన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


హోసూరులో కట్టుమిషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పత్తికొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాది అవకాశాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని హోసూరు గ్రామంలో 50శాతం సబ్సిడీ కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఉచితం కుట్టు శిక్షణతోపాటు సబ్సిడీపై అందుతున్న కుట్టుమిషన్లను ఉపయోగించుకుని ఉపాధి పొందాలన్నారు. ఎంపీడీవో కవిత, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, వెంకటపతి, సురేష్‌కుమార్, బత్తినిలోక్‌నాథ్, కడవలసుధాకర్ తదితరులు ఉన్నారు.

పట్టుదల ఉంటే విజయాలు సాధించగలం

పట్టుదల ఉంటే విజయాలు సాదించగలమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండలపరిషత్ సమావేశభవనంలో ఎంఈవో రమేష్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు సాదించిన వినూత, కళ్యాణమ్మ, మారుతి, చంద్రమోహన్‌ను సన్మానించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల నుంచి పదోన్నతిపై వెళుతున్న వైద్యులు ఆదినాగేష్, వెంకటేశ్వర్లును సన్మానించారు. వైద్యాధికారి కల్పన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదినాగేష్, వెంకటేశ్వర్లు పత్తికొండ ఆసుపత్రిలో అందించిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు.

సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ..

పార్టీ కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద అందిన చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు పంపిణీ చేశారు. 21 మందికి రూ.13.62లక్షల 62వేల చెక్కులను ఆయన అందించారు.

లోకేశ్ తపన అభినందనీయం

- నేపాల్ నుంచి సురక్షితంగా తెచ్చారు
- ఎమ్మెల్సీ బీటీ నాయుడు



ఆదోని, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడంలో రాష్ట్ర మంత్రి లోకేశ్ చూపిన తపన ప్రశంసణీయమని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం మాట్లాడుతూ తెలుగు వారికి ఆపద అనగానే, క్షణం కూడా ఆలస్యం చేయకుండా సహాయక చర్యలు చేట్టారన్నారు. నిన్నటి రోజు అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని సచివాలయంలో రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో సహాయక చర్యలను వేగవంతం చేశారని తెలిపారు. సుమారు 215 మందిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చారన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ కనీసం స్పందించలేదని విమర్శించారు.

జీతాలపై నిర్లక్ష్యం తగదు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ సిబ్బంది మూడు నెలల నుంచి ఉపాధ్యాయుల జీతాలను పెండింగ్ పెట్టడం తగదని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌కే చిన్నప్ప, రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, జిల్లా కార్యదర్శి జయరాం, చంద్రశేఖర్ అన్నారు. గురువారం సబ్ ట్రెజరీ అధికారి శ్రీనివాసులను కలిసి సంబంధిత క్లర్కుపై చర్యలు తీసుకోవాలని కోరారు. జూన్, జూలై, ఆగస్టు జీతాలను క్లర్క్ ఉద్దేశపూర్వకంగా పెండింగ్ పెట్టారని ఆరోపించారు. కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలను ఏక వచనంతో సంబోధిస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను త్వరగా మంజూరయ్యేలా చూడాలన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

దేవనకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండంలోని కప్పట్రాళ్ల వద్ద కర్నూలు-బళ్లారి రహదారిపై హంద్రీకాలువ మలుపులో ఆటో బోల్తాపడి వ్యక్తి మృతిచెందాడు. వివరాల మేరకు.. కుమారుడికి చెందిన ఆటోలో వెళుతుండగా ఎక్సలేటర్ వైరు తెగిపోవడంతో అదుపు తప్పింది. కరివేముల గ్రామానికి బోయ తలారి రోగన్న(62) అక్కడిక్కడే మృతి చెందాడు. రెండో కుమారుడు తలారి గోపాల్‌కు చెందిన ఆటోలో కోడుమూ రుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకొంది. మృతుడు రోగన్నకు భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు, కుతూరు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

మద్దికెర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటలకు నానో యూరియా వాడితే అధిక దిగుబడి సాధించవచ్చనీ జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రంగారెడ్డి, ఏవో అన్నారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో నానో యూరియా, డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. సిబ్బంది బోజరాజు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో విద్యుత్‌తో జాగ్రత్త

తుగ్గలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విద్యుత్ స్థంభాలు, తీగలతో జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ ఏఈ సుజాత సూచించారు. గురువారం మాట్లాడుతూ రైతులు మోటార్లు ఆన్ చేసేసమయంలో చేతులకు గ్లౌజులు వేసుకోవాలని, కనీసం ఎండు కట్టెను ఉపయోగించి ఆన్ చేయాలన్నారు. విద్యుత్ స్థంభాలను తాకవద్దని, విద్యుత్ సమస్యలుంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఆదర్శ నాయకుడు సీతారాం ఏచూరి

దేవనకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దివంగత సీతారాం ఏచూరి నేటి యువతకు ఆదర్శనాయకుడని సీపీఎం జిల్లా నాయకుడు వీరశేఖర్ అన్నారు. గురువారం తెర్నేకల్లు గ్రామంలో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి నిర్వహించారు. విద్యార్థి దశనుంచే ప్రజాసమస్యలు, ఉద్యమాలవైపు నడిచి, దేశంలో కీలకమైన నాయకుడిగా ఎదిగారన్నారు

విగ్రహం ధ్వంసం హేయం

ఆలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణేకుర్తి గ్రామంలో భక్త కనకదాస్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. గురువారం మాట్లాడుతూ విగ్రహాలను ధ్వంసం చేయడం సరికాదని, ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చుపెట్టేందుకు కొందరు ఇలా చేశారన్నారు. పోలీసులు దర్యాప్తు చేసి దుండగులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు.

కేసు అప్రజాస్వామికం

ఆదోని టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై బైండోవర్ కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్ అన్నారు. గురువారం మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులను కలిగిస్తున్న వారిపై నమోదు చేయాల్సిన కేసును తనపై బనాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ షబ్లి ద్వారా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో ఫాగింగ్

మద్దికెర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్దికెర, బొజ్జనాయునిపేట గ్రామాల్లో సర్పంచ్ బండారు సుహాసిని, కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. వర్షాల నేపథ్యంలో దోమల సంతతి పెరగకుండా ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు నీటిని కాచి, చల్లార్చి చల్లార్చి వడబోసి తాగాలని కోరారు. ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ యాదవ్, పంచాయతీ సభ్యులు బాలచంద్ర, వెంకట్రాయుడు, ఉన్నారు.

ఎద్దు మృతి

తుగ్గలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కెళ్ల గ్రామంలో బాలు అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు కథనం మేరకు.. పశులపాకలో కట్టేసి ఉండగా గురువారం విద్యుత్ వైర్లు పాకకు తగలడంతో విద్యుత్ ప్రసరించింది. రూ.70వేలు నష్టపోయానని ఆదుకోవాలని రైతు కోరాడు. కాగా తనను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఫోన్‌లో పరామర్శించారని రైతు తెలిపారు.

హతవిధీ.. ఇదేం శిక్షణ

- ప్రభుత్వ ఐటీఐ దుస్థితి
- పాత షెడ్డు పై కప్పు నుంచి లీక్ అవుతున్న నీరు


ప్లాస్టిక్ కవర్ కప్పుకుని చదువుతున్న శిక్షణార్థులు

ఆలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ శిక్షణార్థులు అవస్థలు పడుతున్నారు. సొంత భవనం లేకపోవడంతో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని చిన్నపాటి పాత షెడ్‌లో శిక్షణ ఇస్తున్నారు. దాదాపు 200 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు.వర్షం వచ్చిందంటే నీరు లీకవుతోందని, అలాగే శిక్షణ పొందాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురుస్తుండటంతో నీరు లీక్ అవుతుండడంతో ప్లాస్టిక్ కవర్లు కప్పుకున్నారు. ప్రభుత్వం పక్కా భవనం నిర్మించి మా కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.


వర్షపు నీటిలో అవస్థలు..

వేధింపులు ఆపాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలై అధికారుల వేధింపులు ఆపాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ అధికారి వేధింపుల తో అస్వస్థతకు గురైన కురువళ్లి అంగన్‌వాడీ కార్యకర్త భువనేశ్వరిని జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా నాయకులు నారాయణస్వామి, హనుమంతు పరామర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ వల్ల పనిఒత్తిడి పెరిగిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తంగాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


భువనేశ్వరిని పరామర్శిస్తున్న నాయకులు

దుండగులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం తన కార్యాలయంలో కురువ సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. కొందరు ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాగరాజు, ఆలూరు తాలూకా టీడీపీ నాయకుడు రఘురాజు, చాగి మల్లికార్జున, హనుమంతు పాల్గొన్నారు.

పొదుపు మహిళల అభివృద్ధికి కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- హాలహర్వి వెలుగు ఏపీఎం నాగార్జున



హాలహర్వి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తానని వెలుగు ఏపీఎం నాగార్జున అన్నారు.

ప్రశ్న: మండలంలో పొదుపు సంఘాలు, సభ్యుల వివరాలు?

జవాబు: 814 పొదుపు సంఘాలు ఉండగా, 8140 మంది సభ్యులు ఉన్నారు. వీటితోపాటు ప్రతి గ్రామానికి మహిళా ఐక్య సంఘాలను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: సంఘాల పనితీరు ఎలా ఉంది?

జవాబు: ప్రస్తుతానికి పొదుపు సంఘాలు పనితీరు చాలా బాగుంది. రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నారు. అయితే పొదుపు రుణాల సద్వినియోగం విషయంలో అవగాహన లోపం ఉంది.

ప్రశ్న: రుణాలకు పావలా వడ్డీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందా.?

జవాబు: ఇప్పటి వరకు ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలు మం జూరు చేయలేదు. రుణాలు చెల్లించిన వారి వివరాల నివేదిక పంపుతున్నాం.

ప్రశ్న: పొదుపు సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ఏ పథకాలు ప్రవేశపెట్టింది?

జవాబు: పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాలతో పాటు స్త్రీ నిధి, ఉన్నతి పథకాల ద్వారా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందజేస్తాం.

ప్రశ్న: సంఘాల అభివృద్ధికి ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు?

జవాబు: పొదుపు మహిళలు స్వయం ఉపాధి పొందేలా యంత్రాలను కొనుగోలు చేయిస్తాం వారిక ఉత్పత్తులను మార్కెట్లలో అమ్ముకునేలా చర్యలు తీసుకుంటాం. రుణా లను సద్వినియోగం చేసుకునేలా చూస్తాం.

ప్రశ్న: పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: పేదరిక నిర్మూలనకు పొదుపు సంఘాలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు రుణాలు ఇస్తాం. ప్రతి మహిళను లక్షాధికారిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి, అవగాహన కల్పిస్తాం. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

పీఠాధిపతి సేవలు మరువలేనివి: ఎమ్మెల్యే



జయశంకర్‌స్వామికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

నందవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పూలచింత బండేగురు పీఠాధిపతి జయశంకర్‌స్వామి ఆధ్యాత్మికంగా ఆయన చేసిన సేవలు మరవలేనివని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పూలచింతలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఆధ్మాత్మికంగా ఎందరో శిష్యులను ఏర్పాటు చేసుకుని కుటుంబంలా వారిని ఆదరించి ఆశీర్వదించి గురుబోద ఇవ్వటంతో చెడుమార్గలకు అలువాటుపడకుండా సన్మార్గంలోకి మార్చి వేలాది మంది కుటంబాలను దైవమార్గంలో నడిపారన్నారు. పీఠాదిపతి కోడలు గ్రామ సర్పంచ్ అక్కామాంబదేవి, బండేగురుస్వామిని పరమర్శించి వారికి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈయనతో పాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, రాష్ట్ర నాయకులు డీవీ రాముడు, ఈరన్నగౌడు, పార్టీ కన్వీనర్ కాశీంవలి, మల్లయ్య, రైస్ నారాయణరెడ్డి, దర్మాపురం గోపాల్, డబ్బా ఈరన్న, సామేలు పాల్గొన్నారు.

పాముకాటుతో యువ రైతు మృతి

కోసిగి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):పాముకాటుతో యువ రైతు బోయ గౌళ్ల ఈరన్న (25) మృతి చెందాడు. బోయ గౌళ్ల ఈరన్న కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కోసిగి మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో ఎప్పటిలాగే బుధవారం బోయ గౌళ్ల ఈరన్న పొలానికి వచ్చి రాత్రి ఆరోగ్యం బాగాలేదని పడుకున్నాడు. అయితే గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇబ్బంది పడుతున్న ఈరన్నను కుటుంబ సభ్యులు కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎలా చనిపోయాడో తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అయితే ఏదైనా విష పరుగు కాటేసిందా అన్న కోణంలో కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలోని పాము కాటుకు నాటు వైద్యం చేసే వారి దగ్గరికి వెళ్లారు. అక్కడ పాము కాటుతోనే మృతి చెందాడనీ అక్కడి వారు చెప్పారనీ కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్న వయసులోనే పాము కాటుతో యువ రైతు ఈరన్న మృతితో కందుకూరు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈరన్నకు భార్య జయమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు..

కౌతాళం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని బదినేహాల్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఉలిగయ్య(54) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఉలిగయ్య మరణ వార్తను తెలుసుకున్న సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి బదినేహాల్ గ్రామానికి వెళ్ళి ఉలిగయ్య మృతదేహానికి పూలమాల వేసి పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం పాటుపడుతూ మండలంలో సీపీఎం చేపట్టిన ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళారని ఆయన లేని లోటు పూడ్చలేమన్నారు. మట్టి ఖర్చులకు రూ.5వేలను పార్టీ అందజేసినట్లు తెలిపారు. నివాళి అర్పించిన వారిలో సీపీఎం నాయకులు ఈరన్న, సత్యప్ప ఉన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

పెద్దకడబూరు , సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం క్షయ వ్యాధిగ్రస్థులకు పోషకాహర కిట్లును పంపిణీ చేశారు.. మండలంలోని పేద క్షయ వ్యాధిగ్రస్థులు పోషకాహర కిట్లును సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు సేఖన్ భాను, కేజియా అన్నారు. హెల్త్‌సెంటర్ స్టాఫ్ సహకారంతో పోషకాహార కిట్లను ఐదు నెలలకు సరిపడే సరుకులను అందజేశామన్నారు. ఒకొక్కరికి రూ.వెయ్యి చొప్పున నెలకు సరిపడ పోషకాహార కిట్లను ఆరు నెలల పాటు ఇవ్వడం ఇస్తామన్నారు. ప్రధాన మంత్రి టీబీముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధిగ్రస్తులను దత్తత తీసుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, భాస్కర్, శ్రీధర్, కిశోర్‌కుమార్, సీహెచ్‌వో ఆదినారాయణ, సుశీల, లక్ష్మీనరసమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కారు, స్కూటర్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కారు, స్కూటర్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. కొటేకల్లు గ్రామానికి చెందిన లేపాక్షి, అశోక్ సీతాఫలాలను విక్రయించి తిరిగి కొటేకల్లు గ్రామానికి వెళుతుండగా మంత్రాలయం నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లేపాక్షి, అశోక్ గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డా. బీ ఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి రూ 50 లక్షలు ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులకు ఇచ్చినట్లు కమిటీ చైర్మన్ కదిరికోట అదెన్న తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరు జయన్న స్థల పరిశీలన చేసి రూ 50లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి డీపీఆర్ నివేదికను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు పంపించారని తెలిపారు. అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ సభ్యులు ఆదెన్న, దేవసహాయం, ఆనంద్‌లు సిద్ధం చేసిన నివేదక ను కర్నూలు పంచాయతీ రాజ్ శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ వేణుగోపాల్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటి డైరెక్టర్ రాధికలను కలిసి ఎస్టిమేట్ కాపీలను అందజేసి భవన నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని, నిధులు మంజూరు చేసి దళితుల చిరకాల స్వప్నం నెరవేర్చాలని వారిని కోరారు. తమ కమిటీ సుదీర్ఘ పోరాట ఫలితంగా భవన నిర్మాణ సాధ్యం కాబోతుందని అన్నారు. ఈ నెల 13న కుర్ని కల్యాణ మండపంలో దళితుల సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అర్చకుడికి ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాయలంలో అర్చకులుగా పనిచేస్తున్న కరణం నాగభూషణంను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పరామర్శించారు. టీడీపీ కార్యకర్త ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ డీఎల్‌వో కరణం గురురాఘవేంద్ర రావు తండ్రి నాగభూషణం బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగభూషణం కుటుంబాన్ని పరామర్శించి, ఆరోగ్య వివరాలు తెలుసుకొని గురు రాఘవేంద్రకు ధైర్యం చెప్పారు. పార్టీ తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కార్యకర్తల కుటుంబాల సంక్షేమం వారి కుటుంబాలకు ఆరోగ్య భద్రత టీడీపీ పార్టీ బాధ్యతగా ఉంటుందన్నారు..

మంత్రాలయంలో భారీ వర్షం



మంత్రాలయం నల్లవాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు



మంత్రాలయం ప్రధాన రోడ్డులో ప్రవహిస్తున్న వర్షం నీరు

మంత్రాలయం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో కుండపోత వర్షానికి మంత్రాలయం అతలాకుతలమైంది. రోడ్లు, పంట పొలాలు జలమయమయ్యాయి. రాఘవేంద్రపురం, రామచంద్రనగర్‌లోని లోతట్టు ఇళ్లలోకి నీరు చేరి కాలనీవాసులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. బుధవారం అర్ధరాత్రి 45 నిమిషాలు ఏకధాటిగా భారీ వర్షం పడటంతో గురువారం తెల్లవారుజామున 5గంటల నుంచి 9గంటల వరకు కుండపోత వర్షం పడటంతో వంకలు, వాగులన్నీ పొంగిపొర్లాయి. మంత్రాలయం రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగుకాలువలు నిండి పొంగిపొర్లాయి. మంత్రాలయం సమీపంలో ప్రవహిస్తున్న నల్లవాగు పొంగడంతో ఆరుగంటలు రాకపోకలు నిలిచాయి. నాగలదిన్నె నుంచి మంత్రాలయం వస్తున్న ఆర్టీసీ బస్సు వరదలో చిక్కుకుంది. గ్రామస్థుల సహాయంతో అతికష్టంమీద బస్సును బయటకు తీశారు.

దాదాపు 10వేల ఎకరాల్లో..

మంత్రాలయంలో 51.6 ఎంఎం వర్షం నమోదు కావడంతో పత్తి, మిరప, ఉల్లి, సజ్జ, పంటలన్నీ నీటిలో మునిగి దాదాపు 10వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఆదోని డివిజన్‌లోనే అత్యధికంగా వర్షం విషయం తెలుసుకున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ నల్లవాగును పరిశీలించి నీరు తగ్గేవరకు రాకపోకలు బంద్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రాలయం ఆర్టీసీ బస్టాండు, ఉన్నత పాఠశాల, ప్రధాన రహదారులు రాఘవేంద్రపురం, రామచంద్రనగర్ రోడ్లు జలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రజలను స్వస్థలాలకు చేర్చిన ఘనత లోకేశ్‌దే

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లోచిక్కుకున్న తెలుగు ప్రజలను స్వస్థలాలకు చేర్చిన ఘనత మంత్రి నారా లోకేశ్‌కు దక్కిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తెలుగువారు ఎక్కడ ఆపదలో ఉన్నారన్న తెలిసినా.. క్షణాల్లోనే స్పందించే గుణం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కే సొంతమని అన్నారు. నేపాల్‌లో ఉన్న తెలుగువారిని అక్కడి అధికారులతో సమన్వయం చేసి స్వస్థలాలకు చేర్చడంలో లోకేశ్ పాత్ర అభినందనీయమన్నారు. అనంతపురం సూపర్‌సిక్స్ - సూపర్ హిట్ అయిందని, సూపర్ సిక్స్‌కు రావాల్సిన మంత్రి నారా లోకేశ్ హుటాహుటిన సచివాలయం చేరుకుని కంట్రోల్ రూమ్ ద్వారా సహాయక చర్యలు చేపట్టి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పి కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసి వారికి వసతి, ఆహార సదుపాయాలు కల్పించిన ఘనత లోకేశ్‌కు దక్కుతుందన్నారు. ఇలాంటివి ఎన్నో కృషి చేశారని కొనియాడారు.

కోసిగిలో చిరుతల సంచారం



పత్తి పొలంలో చిరుతపులి పాదముద్ర

కోసిగి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని సజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీ సమీపంలోని కోసిగి చెందిన రైతు ఉమర్‌సాబ్ పత్తి పొలంలో జోడి చిరుత పులుల సంచారంతో రైతులు భయంతో ఆందోళనలు చెందుతున్నారు. పొలాల్లో అధికంగా జింకలు వస్తాయనీ, జింకల కోసమే చిరుత పులులు వచ్చినట్లు రైతు ఉమర్‌సాబ్ ఆందోళన వ్యక్తం చేశాడు. తన పత్తి పొలంలో చిరుత పులుల జాడలు రెండు లైన్లలో ఉండంటంతో భయంతో వ్యక్తం చేశారు. ఫారెస్టు అధికారులు స్పందించి చిరుత పులులను బోనులో బంధించాలని తెలిపారు. సమీపంలోని రైతులు కూడా చిరుత పులుల సంచారంపై ఆందోళన వ్యక్తం చేశారు.

జీడీపీ సందర్శన



జీడీపీ అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ భార్గవి

గోనెగండ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టును ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి గురువారం సాయంత్రం సందర్శించారు. ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు జీడీపీ అధికారులు సన్నద్ధం అవుతుండటంతో డీఎస్పీ సందర్శించి ప్రాజెక్టులో ఎంత నీరు ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ శాతం ఎంత ప్రస్తుతం నీరు ఎంత ఉంది ఇంకా వరద ద్వార ఎంత నీరు చేరతుందని జీడీపీ డీఈ సుబ్బరాయుడిని అడిగితెలుసుకున్నారు. హంద్రీ పరివాహక ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తమ పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ఆమె వెంట గోనెగండ్ల సీఐ విజయభాస్కర్, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఆట్యాపాట్యా పోటీల్లో ప్రతిభ

కోసిగి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆట్యా పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలులోని డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఆట్యా పాట్యా పోటీలకు ఎంపికైన విద్యార్థినులు గురువారం జరిగిన గుంటూరులోని పల్నాడులో 11వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ మహిళా టోర్నమెంటులో రాష్ట్ర స్థాయి ఆట్యా పాట్యాలో కోసిగి కేజీబీవీ విద్యార్థినులు మూడో స్థానంలో విజయం సాధించారని పీడీ సుమ తెలిపారు. కేజీబీవీ పాఠశాల నుంచి విద్యార్థినులు అన్ని క్రీడల్లో రాణిస్తూ విజయం సాదిస్తున్నారని, రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆట్యాపాట్యాలో మూడోస్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థినులకు మెమెంటోలు, పతకాలు, షీల్డ్ అందజేశారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

అధికారులు, వైద్యులతో ఎమ్మెల్యే బీవీ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అధికారులకు, వైద్యులకు సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయా మండలాల అధికారులు, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?, ఎన్ని కేసులు నమోదు అయ్యాయి? అనే విషయాలని అధికారులను అడిగితెలుసుకున్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు: అల్లర్లు జరుగుతున్న నేపాల్ దేశంలో ఇరుక్కు పోయిన మన రాష్ట్రానికి చెందిన వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు కర్నూలు జిల్లా ప్రజల తరుపున అభినందనలు తెలుపుతున్నామన్నారు.

రజత గజవాహనంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ అంబారిపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : శ్రీ మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవసమాధి పొందిన గురువారం చవితి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశ్రీస్సులతో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య రజత గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు.

భక్తులతో కిక్కిరిసిన శ్రీమఠం: మంత్రాలయం భక్తులతో కోలాహలంగా మారింది. గురువారం రాఘవేంద్ర స్వామికి ఇష్టమైన దినం, బాద్రపాద చవితి కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఒకవైపు వర్షం కురుస్తుండగా ఉదయం ఇసుకేస్తేరాలనంత మంది భక్తులతో మఠం ప్రాంగణం కిక్కిరిసింది.

గ్రేడింగ్ చేసిన ఉల్లికి మద్దతు ధర

గోనెగండ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):గ్రేడింగ్ చేసిన ఉల్లి పంటకు మార్కెట్‌లో మద్దత్తు ధర లభిస్తుందని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. గురువారం సాయంత్రం గోనెగండ్ల మండలంలోని వేముగోడు గ్రామంలో రైతులు పండించిన ఉల్లి పంటను ఆయన పరిశీలించారు. రైతుల నుంచి పంటసాగు ఉత్పత్తి అమ్మకాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పండి పంటలో ఉల్లి నాణ్యతను పరిశీలించారు. శని, ఆదివారాలలో కర్నూలు ఉల్లి మార్కెట్ కు సెలవులు కావడంతో తాడేపల్లి గూడెంలో కూడా ఉల్లి కి మద్దత్తు ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఏవో హేమలత, ఉద్యనవనశాఖ అధికారిణి శ్రీవాణి సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

నందవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో ఈనెల 13న తలపెట్టిన దళితుల సమ్మెళన సభను జయప్రదం చేయాలని బిఆర్ అంబేద్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న కోరారు. నందవరంలో గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్యతో కలసి విలేకరులతో మాట్లాడారు. పార్టీలకతీతంగా ముందుకు వచ్చి సభకు తరలి వచ్చి తమ హక్కులు సాదించుకోవాలన్నారు. ఈనెల 13న ఎమ్మిగనూరు పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో సభ జరుగుతుందన్నారు.

మేకలపైకి దూసుకెళ్లిన వాహనం

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బోడబండ గ్రామంలో మేలకపైకి వాహనం దూసుకెళ్లిన ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. మేకల రైతు వెంకటరాముడు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు వెంకటరాముడు తన మేకలను మేపేందుకు తీసుకెళ్తుండగా పత్తిపంటను తీసుకొని ఆదోనికి వెళ్తున్న వాహనం మేకలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 9 మేకలు మృతి చెందాయి. రోడ్డు ప్రమాదంలో 9మేకలు మృత్యువాత పడడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నందవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నందవరానికి చెందిన దేవళ్ల సోదరులు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని గురువారం సన్మానించారు. బీవీ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన దేవళ్ల సోదరులైన దేవళ్ల పెద్దరాముడుకు ఎల్లెల్సీ టీసీ మెంబర్‌గా, దేవళ్ల చిన్నరాముడుకు రాష్ట్ర బీసీ కో- ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గాను, దేవళ్ల బీమశేఖర్‌కు గ్రామ టీడీపీ అధ్యక్షుడుగాను, సహకార సంఘం డైరెక్టర్‌గానూ, దేవళ్ల లచ్చప్పనాయుడుకు టీడీపీ మండల ప్రదాన కార్యదర్శిగా పదవులు ఇవ్వడంతో ఎమ్మెల్యే బీవీని వారు సన్మానించి బీవీ కుటుంబానికి దేవళ్ల కుటుంబం రుణ పడి ఉందన్నారు. తమకు అప్పగించి ఈ పదవులకు న్యాయం చేస్తామని వారు తెలిపారు. వీరితో పాటు మాజీ ఎంపీటీసీ తిమ్మరాజు, పల్లె తిప్పారెడ్డి, ఈశా పాల్గొన్నారు.

పనిముట్ల పంపిణీ



పనిముట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా పనిముట్లను 17వ వార్డు నందు 17వ ఇంచార్జి వడ్డే బజారి, బీజేపీ జిల్లా కార్యదర్శి దయాసాగర్ అందజేశారు. ఈ సందర్భంగా దయాసాగర్ మాట్లాడుతూ విశ్వకర్మ పథకంలో బాగంగా లబ్ధిదారులకు పనిముట్లను పంపిణీ చేసి వారిని ఆర్థికంగా నిలదొక్కుకొవడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ బడుగు బలహీనులకు ఎన్నో పథాకలను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో శిల్పి భాస్కర్, రమేశ్, నాగరాజు, నారాయణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

మంత్రాలయం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో గత ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణాల్లో పురోగతి పనులు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. గురువారం మంత్రాలయంలోని హౌసింగ్‌లో వివిద నిర్మాణాల్లో ఉన్న ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను, మంత్రాలయం బైపాస్ రోడ్డు భూసేకరణ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ గృహ నిర్మాణాల్లో అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించి వెంటనే నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేయాలని సూచించారు. గతంలో బేస్‌మట్టం, రూఫ్‌లెవెల్ ఉన్న వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెట్నహళ్లి, కల్లుదేవకుంట మధ్య బైపాస్ జాతీయ రహదారి కొరకు అవసరమైన భూసేకరణ ప్రాంతాలను పరిశీలించి త్వరలో భూసేకరణ చేపట్టి రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆదేశాలు చేస్తామన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ జనార్దన్ రావు, వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉల్లి పంటను పరిశీలిస్తున్న డీఏఏటీ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

గోనెగండ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యాన వన శాఖలో రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని డీఏఏటీ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని హెచ్ కైరవాడి, కులుమాల గ్రామాలలోని ఉల్లి రైతులకు క్యూరింగ్, గ్రేడింగ్ మీద రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఉల్లిపంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని పంటను కసాక 7 నుంచి 10 రోజులు ఆరబెట్టాలని రైతులకు సూచించారు. ఉల్లిగోదాములు, ఉల్లి గోగ్రువాడి రైతులు ఉల్లి పంట ఖర్చులను తగ్గించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యనవన శాఖ అధికారిణి శ్రీవాణి, సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలబాలికల అండర్ - 19 ఫుట్‌బాల్ పోటీలు జరిగినట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా అండర్-19 ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ - 19 ఫుట్‌బాల్ ఎంపికలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వివిధ కాలేజీ, పాఠశాలల నుంచి బాల బాలికలు దాదాపు 160 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఇందులో ఎంపిక అయిన క్రీడాకారులు ఈ నెల చివరి వారంలో ఎమ్మిగనూరులో జరిగే అండర్ - 19 స్టేట్ లెవెల్‌లో పాల్గొంటారని తెలిపారు. జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, నరసప్ప, ప్రసాద్, లతీఫ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని వార్డు సచివాలయ ఉద్యోగులు రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు పట్టణ వార్డు సచివాలయ ఉద్యోగులు అడాహక్ కమిటీ సభ్యులు సత్యరాజు, రవికిరణ్, హంపి రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలపై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి, తహసీల్దార్ శేషాఫణికి వినతి పత్రం అందజేశారు. వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కౌతాళం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన కౌతాళంకు చెందిన రిటైర్డు సహకారం సంఘం సీఈవో, విశ్వహిందూ పరిషత్ సభ్యులు మారుతి మోహన్ దంపతులను గ్రామ పెద్దలు, యువకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గణపతి రాజు, డాక్టర్ అప్పులు, ఉపేంద్ర, సత్యగౌడ్, నరసింహ, సాయిబాబ దాట్ల యూత్ సభ్యులు పాల్గొన్నారు.